# సంపాదకీయం



సహాయం చేసిన వారికి Thanks అని చెప్పి తరువాత ఎటువంటి సంబంధం లేకుండా జీవించడం కంటే, చేసిన సహాయాన్ని మననం చేసుకుంటూ జీవితాంతం ఋణపడి ఉండడం మనిషియొక్క మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది.

సృష్టిలో, మానవులందరిలో మహోన్నతమైన స్థానాన్ని పొందిన వారు మరియతల్లి. ఆమెను ఎన్నెన్నో పేర్లతో బిరుదులతో గౌరవించారు. శ్రీసభ పితామహులు, పునీతులు, వేద పండితులు ఆమెను "నిష్కళంకమాత" అని "సర్వేశ్వరుని మాత" అని, "నిత్య సహాయమాత" అని "జపమాల రాజ్ఞి" అని పిలిచారు. ఎలా చదవాలో తెలియాలేగాని, " ప్రతి మనిషి ఒక గ్రంథమే" అన్నారు పెద్దలు. అంతటి మహిమాన్వితమూర్తి గురించి ఎంత తెలిసినా తక్కువే, ఎంత చెప్పుకున్నా తక్కువే.

జపమాలమాతగా కొనియాడబతుతున్న మరియమాత మానవ రక్షణ ప్రణాళికలో ఆమె త్యాగం, వినయం, విధేయత ఎంతో శ్లాఘనీయం. ఆమె సహకారంతో తన కుమారుడైన క్రీస్తు రక్షణ అనుగ్రహాలు పొందిన కతోలిక విశ్వాసుల సంఘం ఆమెకు జీవితాంతం ఋణపడి ఉండవలసిందే. ఎలా? అంటే ఆమెకు ప్రీతి పాత్రమైన జపమాలను ధ్యానించడం ద్వారా అని నా భావన, నా నమ్మకం.

ప్రియ విశ్వాసులారా! "సుగుణాలరాశి" అయిన మరియతల్లిని గూర్చి కొన్ని విషయాలు తెలుసుకుందాం!

**1. మరియ - నూతన అవ్వ:**

సాతానుని ప్రలోభానికి లొంగి, దైవాజ్ఞను దిక్కరించి, తన అవిధేయత ద్వారా దేవుడు తనకు తోడుగా ఇచ్చిన పురుషునితో సహా పాపం కట్టుకొని మానవ పతనానికి కారణమైన తొలి అవ్వకు ధీటుగా నిలచి తన విధేయత ద్వారా, తండ్రి దేవుడిచ్చిన పురుషుని (జోజప్పగారు) సహకారంతో నూతన అవ్వ అయిన మరియమాత మావన

పునరుద్ధరణకు కారణం అయింది. తొలి అవ్వ సాతానుకు ప్రతీకగా ఉన్న సర్పము యొక్క మాటలను నమ్మి మోసపోయింది. నూతన అవ్వ (మరియతల్లి) అదే సర్పము యొక్క తలను చితకత్రొక్కి విజయ గర్వంతో నిలచింది. తొలి అవ్వ దైవాజ్ఞలను దిక్కరించి దేవుణ్ణి ఆగ్రహానికి గురిచేస్తే, నూతన అవ్వ (మరియతల్లి) తన విధేయతతతో దేవుని సంతోష పరచింది.

**౨. మరియ - నిరాడంబరి:**

పొగడ్తలకు, ముఖస్తుతులకు, ఆడంబరాలకు మురిసిపోయే లోకానికి గొడ్డలిపెట్టు మరియతల్లి.

**లూకా 1:42** "స్త్రీలందరిలో నీవు ఆశీర్వదింపబడినదానవు. నీ గర్భఫలము ఆశీర్వదింపబడెను" అని పలికిన ఎలిశబేతమ్మ మాటలకు పొంగిపోలేదు మరియతల్లి. మన గొప్పతనం గురించి, మన బిడ్డల గొప్పతనం గురించి వేరేవాళ్ళు గొప్పగా చెప్పినప్పుడు మనం గాల్లో తేలిపోతాం. మన స్థితిగతులనే మర్చిపోతాం. కానీ మరియతల్లికి అంతటి ధన్యత, ఘనత లభించినా, గర్వపడలేదు కానీ ఒక సాధారణ భావాన్నే వ్యక్తం చేస్తూ దేవుణ్ణి స్తుతించింది.

**లూకా 11:27** "నిన్ను మోసిన గర్భమును, నీకు పాలిచ్చిన స్తనములును ధన్యమైనవి" అని జనసమూహంలో ఒక స్త్రీ ఎలుగెత్తి పలికినప్పుడు. అది తెలిసిన మరియతల్లి సంతోషంతో గంతులు వేయలేదు. గర్వంతో ఉప్పొంగి పోలేదు. ఇంటిటా తన గొప్పతనాన్ని చాటింపలేదు. కృతజ్ఞతాభావంతో దేవుణ్ణి స్తుతించింది.

**లూకా 2:30-31** "ప్రజలందరి ఎదుట నీవు ఏర్పరిచిన రక్షణను కనులారా గాంచితిని" అని సిమియోను ప్రవక్త పలికినప్పుడు మరియతల్లి ఆశ్చర్యపడిందే తప్ప, ఎప్పుడూ ఇతరుల మీద పెత్తనం చెలాయించలేదు. ఒక ప్రవక్తే, తన కుమారుని గురించి గొప్పగా చెప్పినప్పుడు, అదంతా తన గొప్పతనంగా భావించలేదు మరియతల్లి. మౌనంగా దేవుని మననంచేస్తూ ఆదర్శవంతమైన జీవితం జీవించింది.

### 3. మరియతల్లి - విధేయురాలు

**లూకా 8/21** – దైవవాక్కును విధేయించింది.

**లూకా 1/38** – ఇదిగో నేను ప్రభు దాసురాలను అని దేవుణ్ణి విధేయించింది.

**లూకా 2:22–24** – మోషే చట్ట ప్రకారం తన కుమారుణ్ణి దేవునికి అర్పించి దైవ చట్టాన్ని విధేయించింది.

**లూకా 21:49–51** తన కుమారుడు ఎలాంటి దైవకార్యాన్ని తన మీద వేసుకున్నాడో ప్రారంభంలో ఆ తల్లికి తెలియనప్పటికి, దైవకార్యాన్ని విధేయించింది.

### 4. మరియ - పరోపకారి

"మానవ సేవయే మాధవసేవ" అన్నారు. పరులసేవకై కొంతమంది రేయింబవళ్ళు శ్రమిస్తారు. (ఉదా: మధర్ థెరిస్సా). ఎలిశబేతమ్మకు సహాయపడాలని ఆశించింది మరియతల్లి. దూరాన్ని లెక్కచేయలేదు. కష్టకాలం గడిచేవరకు ఆమెకు తోడుగా ఉంది. అప్పటికే దేవదూత వర్తమానం అందుకున్న మరియతల్లి తన గొప్పతనాన్ని పరోపకారంలో చూపించలేదు. కానాపల్లెలో కుటుంబ అవసరాన్ని గుర్తించి, కుటుంబ గౌరవాన్ని పరోక్షంగా కాపాడిన నిత్య పరోపకారి మరియతల్లి.

ఇలా చెప్పుకుంటూపోతే, రాసుకుంటూ పోతే మాటలు చాలవు, గ్రంథాలు సరిపోవు. అలాంటి ధన్యురాలైన మరియమాతను, మన ఆధ్యాత్మిక తల్లిని మన విశ్వాస యాత్రలో తోడుగా ఉండి నడిపించే పరోపకారిణి అయిన జపమాలరాజ్ఞి అయిన మరియతల్లిని ఈ జపమాల మాసంలో (అక్టోబరు) మన "ప్రార్థన మాల" జపమాలతో సన్మానించడం మనం ఆమెకు ఇచ్చే గౌరవం.

ఫా. దామాల విజయ కుమార్
ఎడిటర్

# సామాన్య 26వ ఆదివారం
# 01-10-2017

***యెహెజ్కేలు 18:25-28 ఫిలిప్పీ 2:1-11 మత్తయి 21:28-32***

లోకంలోని మానవులందరు రక్షణభాగ్యాన్ని పొందాలన్నదే దేవుని సంకల్పం. అంటే మనలోని ప్రతి ఒక్కరినీ రక్షించడానికి ఆయన ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారు. అయితే ముందుగా రక్షణ పొందడానికి యోగ్యమైన లక్షణాలు కనీసం కొన్నయినా మనలో ఉన్నాయో లేదో చూస్తుంటారాయన. ముఖ్యంగా మనో పరివర్తనం చెందాలన్న ఆశ, మన జీవితంలో మేలైన మార్పులు తెచ్చుకొని "రూపాంతరం" చెందాలనే అభిలాష మనలో ఉన్నాయో, లేదో గమనిస్తారు.

నిజానికి మన జీవితాల్లో మార్పును కోరుకునే ఆశను, అభిలాషను కలిగించేవారు, మనలో వాటిని పెంపొందించేవారు తండ్రి భగవానుడే. ఆయన మన కొసగే కృపావరాల ఫలితంగానే మనకీ ఆశ కలుగుతుంది, మనలో ఈ అభిలాష పెంపొందుతుంది. ఇలా తనకు తానుగా మన కొసగిన ఈ సదాశయాలనే మనకు గల "యోగ్యత" లుగా లెక్కించి, మనకు రక్షణాభాగ్యాన్ని ప్రసాదించడం తండ్రి దేవునికి మన పట్ల గల అనంతమైన ప్రేమకు తార్కాణం.

ఇలా తండ్రి దేవుడు ప్రసాదించే రక్షా భాగ్యాన్ని పొంది ఆధ్యాత్మికంగా పురోగమించడానికి, ఆదర్శ క్రైస్తవ జీవితం గడపడానికీ "దివ్య సత్ప్రసాదం" మనకు తోడ్పడుతుంది, దేవుడనుగ్రహించిన రక్షణభాగ్యాన్ని మనలో సుస్థిరంగా నిలుపుతుంది. పదిలంగా కాపాడుతుంది.

## మొదటి పఠనం: యెహెజ్కేలు 18:25-28

యెహెజ్కేలు మొదట యెరూషలేము దేవాలయంలో యాజకుడుగా పనిచేస్తూండేవాడు. క్రీస్తు పూర్వం 587లో యెరూషలేము శత్రువుల వశమైనపుడు, సాటి ఇస్రాయేలీయులతోపాటు తానూ బందీగా బాబిలోనియా ప్రవాసానికి వెళ్ళాడు. అక్కడ ఉండగానే దేవుడు యెహెజ్కేలును పిలిచి ప్రవక్తగా నియమించారు, ప్రవాసంలో

ఉన్న ఇస్రాయేలీయులకు తన సందేశాలను అందజేస్తూ వారిని తనకు విధేయులైన “శేషప్రజలు” గా తీర్చిదిద్దమని కోరారు; తగిన సమయం వచ్చినపుడు ఈ “శేషప్రజలు” తిరిగి యెరూషలేముకు చేరుకొని, నగరాన్ని పునరుద్ధరించగలుగుతారని తెలియజేశారు. ఆ ప్రకారమే యెహెజ్కేలు ప్రవక్తగా ప్రవాస యూదులకు ప్రభు సందేశాలను ప్రకటింపసాగాడు, ప్రవచించసాగాడు.

యెహెజ్కేలు ప్రబోధాలలో ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే ఇస్రాయేలీ ప్రజలు ఒక జాతిగానే కాకుండా, ఎవరికి వారు వ్యక్తిగతంగా దేవునితో గాఢమైన అనుబంధం కలిగి ఉండాలని సూచించాడు. తొలి రోజుల్లో ఇస్రాయేలీయులు తమలోని వ్యక్తులను సంఘంలో ఒక భాగంగా చూచేవారే తప్ప, వ్యక్తులకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చేవారు కారు. ఈ ప్రమాణాల ప్రకారమే ఒకవేళ వ్యక్తులు పాపం చేస్తే, దానికి సంఘమంతా శిక్షననుభవించాలని చెప్పేవారు. ఇలా వ్యక్తులకంటే సంఘానికి అధిక ప్రాధాన్యతనీయడం వల్లనే “పూర్వికులు చేసిన పాపాలకు గాను, వారి వారసులు మూడు, నాల్గు తరాల వరకు శిక్షననుభవిస్తా” రనే నమ్మకం ప్రబలింది. దీనితో తమ పూర్వికుల పాపాలకు ఎలాగూ తాము శిక్షననుభవించక తప్పదు గనుక, ఇక వ్యక్తిగతంగా తాము పశ్చాత్తాప పడినా, ప్రాయశ్చిత్తం చేసుకున్నా ఫలితముండదని సదరు వారసులు మిన్నకుండిపోయేవారు; మనో పరివర్తనం కోసం గానీ, దైవాదేశాలను పాటిస్తూ దేవునికి విశ్వాస పాత్రులుగా జీవించడానికి గానీ వ్యక్తిగతంగా వారు ఎలాంటి ప్రయత్నాలు చేసేవారు కారు.

కానీ ఇపుడు యెహెజ్కేలు ప్రవక్త ఎవరి ఆధ్యాత్మిక వికాసానికి వారే కృషి చేయాలని ప్రబోధించసాగాడు. యెహెజ్కేలు ప్రబోధాలకు ఇదే ప్రత్యేకతను తెచ్చి పెట్టింది.

అయితే గతంలో ఎప్పుడూ ఇస్రాయేలీ సమాజంలో “వ్యక్తిగత బాధ్యత” కు ఎలాంటి ప్రాధాన్యత లేదా? అనే అనుమానం కలుగవచ్చును. నిజానికి ఇస్రాయేలీ సమాజ ఆధ్యాత్మిక వికాసానికీ, పురోగమననానికీ, అందులోని వ్యక్తులు కూడా బాధ్యత వహించాలనే భావన అంతర్లీనంగా ఉండేది; కానీ ఈ సత్యాన్ని గతంలో ఎవరూ ఎక్కడా నొక్కి చెప్పలేదు. అదీగాక ఇస్రాయేలీయులు ఒక జాతిగా సంఘటితమయ్యాక

వారిలో ఎవరూ దేవునితో వ్యక్తిగతానుబంధాన్ని ఏర్పరచుకోవడానికి దీక్షతో ప్రయత్నించినట్లుగానీ, తపమాచరించినట్లుగానీ, దాఖలాలు లేవు. కనుక ఒకప్పుడు "వ్యక్తులకున్న ప్రాధాన్యత" రాను రాను మరుగున పడిపోయింది, సంఘానికీ, సామూహికతకే ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది.

మళ్ళీ ఇన్నాళ్ళకు యెహెజ్కేలు ప్రవక్త ద్వారా దేవుడు మరుగున పడిన సత్‌సంప్రదాయాలను వెలుగులోకి తెస్తున్నారు. ఇస్రాయేలీ జాతిలోని ప్రతి వ్యక్తీ తనతో సన్నిహిత సంబంధాన్ని పెంపొందించుకోవడం ఎంత అవసరమో స్వయంగా ప్రభువే తన ప్రవక్త ద్వారా వెల్లడిస్తున్నారు.

అవును. మానవులు నిత్యమూ వ్యక్తిగత పరివర్తనకు పాటు పడుతూ, అంచెలు అంచెలుగా తన సన్నిధానికి కదలి రావాలని ప్రభువైన దేవుడు కోరుతూ ఉంటారు. గనుక వ్యక్తిగత ఆధ్యాత్మిక పురోగమనానికి సామాజిక ఆధ్యాత్మిక వికాసం ప్రత్యామ్నాయం కాదు.

ఈ పఠనంలో "వ్యక్తిగత పరివర్తన" కు గల ప్రాధాన్యం సువార్తా పఠనంలో మనం చదువుతోన్న "ఇద్దరు కుమారుల ఉపమానం" ద్వారా మరింత స్పష్టంగా బోధపడుతుంది.

## రెండవపఠనం: ఫిలిప్పీ 2:1-11

ఈనాటి రెండవ పఠనంలో పునీత పౌలు క్రైస్తవుల మధ్య వర్ధిల్లవలసిన ప్రేమానురాగాల గురించీ, సఖ్యతా సామరస్యాల గురించీ, వినమ్ర గుణ వైశిష్ట్యం గురించీ ప్రబోధిస్తున్నాడు. ఈ సందర్భంలోనే ఆనాటి క్రైస్తవ సంఘాలలో బహుళ ప్రచారంలో ఉన్న ఒక ప్రార్థనాగీతాన్ని ప్రస్తావిస్తూ "సిలువపై మరణము వరకు విధేయు" డైన యేసుప్రభువు వినయ సంపన్నుడు గనుకనే తండ్రి దేవుడు ఆయనను మృత్యుంజయుని చేసి మహిమపరచారని స్పష్టం చేస్తున్నాడు.

అయితే యేసుక్రీస్తు ప్రభువు క్రైస్తవులకు ఒక "మాతృక" మాత్రమే కాదనీ, క్రైస్తవులు వినయాత్ములై జీవించడానికి అవసరమైన "దివ్యశక్తి" ని ప్రదానం చేయగలవారు ప్రభువేనని పౌలుకు తెలుసు; స్వయంగా తాను నడచిన మార్గంలో నడుపమని క్రైస్తవులను

ప్రోత్సహించేవారూ, నడచే శక్తినిచ్చేవారూ ప్రభువేనని పౌలు గ్రహించాడు కనుకనే ఇలా అంటున్నాడు.

క్రీస్తు యేసునందు ఈ మనస్తత్వమును మీ మధ్య ఉండనిందు (2:5) విధానాన్ని తాము కూడా స్వీకరిస్తారు. మరో మాటలో చెప్పాలంటే జ్ఞానస్నానం ద్వారా క్రైస్తవులు సాక్షాత్తూ క్రీస్తు ప్రభువును ధరిస్తున్నారు, క్రీస్తు ప్రతిరూపాలుగా మారుతున్నారు.

కనుకనే పౌలు క్రీస్తు ప్రభువు మాదిరి "వినశీలంతో మహిమపరుపబడే" జీవన మార్గాన్ని నిష్ఠగా అనుసరించుమని క్రైస్తవ విశ్వాసులందరికీ పిలుపునిస్తున్నాడు; క్రైస్తవులందరూ క్రీస్తు ప్రభువులో అంతర్భాగాలు గనుక, ప్రభు జీవన మార్గం ఇప్పటికే వారి ఆత్మాతరంగాలలో ముద్రితమై ఉంటుంది. కనుక తదనుగుణంగా జీవించడం వారిని సులభసాధ్యమవుతుంది.

## సువార్త పఠనం: మత్తయి 21:28-32

ఈనాటి సువార్త పఠనంలో మనం చదువుతోన్న " ఇద్దరు కుమారుల ఉపమానాన్ని" యేసుప్రభువు యూదమత నాయకులతో, పెద్దలు, ఇతర యూదులతో, ప్రధానార్చకులతో జరుపుతోన్న చర్చల నేపథ్యంలో చెబుతారు.

ఈ సువార్త పఠనం మనకు బోధించే సత్యమేమిటంటే తాము పాపులమన్న నిజాన్ని గుర్తించి నిండు మనస్సుతో పశ్చాత్తాపపడేవారినీ, తాము మనోపరివర్తనం చెందవలసిన అవసరాన్ని గుర్తించి దేవుని క్షమాకారుణ్యాల కోసం ఆశతో వేచి చూచే వారిని దేవుడు నీతిమంతులుగా పవిత్రులుగా పరిగణిస్తారు. తన రాజ్యంలో ప్రవేశించడానికి వారిని యోగ్యులుగా గణిస్తారు, ఆదరిస్తారు.

ఒక్క మాటలో చెప్పాలంటే మానవులందరు పాపాత్ములే గనుక, దేవుని కారుణ్యం యావత్ మానవ జాతికీ అందుబాటులో ఉన్నదన్న సత్యాన్ని ఈనాటి సువార్త పఠనం ప్రకటిస్తోంది.

ఈ సత్యాన్ని గ్రహించిన వారు తాము చేసిన పాపాలకు గాను పశ్చాత్తాపపడుతూ ప్రాయశ్చిత్తం చేసుకుంటారు, తమకు హృదయ పరివర్తనా వరాన్ని ప్రసాదించుమని దేవునికి మొరపెట్టుకుంటారు.

గనుకనే బప్తిస్త యోహాను ఇదే సందేహాన్ని ప్రబోధించినపుడు, ప్రజలచే పాపులుగా గణింపబడే సుంకరులు వ్యభిచారిణులు నిండుమనస్సుతో మనోపరివర్తనం కోరుకుంటూ, దేవుని క్షమను స్వీకరించడానకి తాము సిద్ధమని చాటుతూ "తపోస్నానం" ఆచరించారు. ఆవిధంగా క్రీస్తు ప్రభువు ద్వారా పాపక్షమను పొందడానికి యోగ్యులయ్యారు.

కానీ యూదమత నాయకులు బప్తిస్త యోహాను పిలుపును పెడచెవిన పెట్టారు, తమ పాపాలకు గాను పశ్చాత్తాప పడడానికీ, తమ బతుకుబాటలో మేలైన మార్పులు సమూలమైన మార్పులు తెచ్చుకోవడానికీ నిరాకరించారు.

ఇక్కడ మనలనందరినీ ఆశ్చర్యచకితులను చేసే విశేషమేమిటంటే బప్తిస్త యోహాను పిలుపునకు తక్షణమే స్పందిస్తూ పశ్చాత్తప్తులై హృదయ పరివర్తనకు సిద్ధపడిన సుంకరులను, పాపులను యేసుప్రభువు ఆర్శమూర్తులుగా ప్రకటించారు. వారిని చూచయినా బుద్ధి తెచ్చుకొమ్మని యూదమత నాయకులను పరోక్షంగా హెచ్చరించారు. ఇక్కడ పాపులను చూచి పాఠాలు నేర్చుకొమ్మని పుణ్యాత్ముల మనుకొనే, మత నాయకులకు సూచించడం విశేషం.

ఇకపోతే ఈనాటి ఉపమానంలో యేసుప్రభువు సుంకరులను పాపులను "పెద్దకుమారునితో" సరిపోల్చారు; అతడు తండ్రి మాట ప్రకారం చేయడానికి ముందు నిరాకరించినప్పటికీ, తరువాత మనసు మార్చుకొని తండ్రి చెప్పినట్లే చేస్తాడు, ఆయన సంకల్పాన్ని నెరవేర్చుతాడు. అలాగే సుంకరులు పాపులు మొదట దేవుని ఆజ్ఞలు మీరి పాపం చేసినప్పటికీ, తరువాత బప్తిస్త యోహాను పిలుపు విని పశ్చాత్తాప పడ్డారు, తమ మనస్సులనూ తమ బతుకులనూ మార్చుకోవడానికి సంసిద్ధులయ్యారు.

అలాగే ప్రధానార్చకులను యూదమత పెద్దలను ప్రభువు ఉపమానంలోని "రెండవ కుమారునితో" పోల్చి చెప్పారు. రెండవ కుమారుడు తండ్రి చెప్పిన వెంటనే "ఇదిగో వెళ్తున్నా" నన్నాడే గానీ, ఆ జాడలకైనా పోలేదు, తండ్రి సంకల్పాన్ని నెరవేర్చలేదు.

ఈ ఉపమానాన్ని ప్రత్యేకంగా ప్రధానార్చకులకు యూదమత పెద్దలకూ చెప్పడం ద్వారా యేసుప్రభువు చివరి నిమిషంలోనైనా వారిలో పశ్చాత్తాపం కలుగుతందని ఆశించారు; బప్తిస్త యోహాను ఇచ్చిన పిలుపును గుర్తుచేసుకొని, ప్రస్తుతం తాను చేస్తోన్న

ప్రబోధానికైనా వారు స్పందిస్తారనీ తమ తప్పులు తాము గుర్తిస్తారనీ, మనోపరివర్తనకు మొగ్గు చూపుతారనీ, మానవులందరికీ దేవుని క్షమాకారుణ్యాలను పంచుతోన్న సువార్తా సందేశాన్ని అర్థం చేసుకొని ఆమోదిస్తారనీ ప్రభువు భావించారు. కానీ ఆయన ఆశ అడియాసే అయింది; యేసు ప్రబోధం యూదుమతాధికారుల్లో ఎలాంటి మార్పూ తేలేక పోయింది.

అయితే మనలోని ప్రతి ఒక్కరమూ నిత్యమూ మన మనోపరివర్తనకు కృషి చేస్తూ ఉండాలి. ఇదే ఈనాటి సువార్తా పఠనం మనకు గుర్తు చేస్తుంది. ప్రభు సాహచర్యాన్ని పొందుమని మనలను ఆహ్వానిస్తుంది. అంతేకాదు. ప్రభువు పిలుపునకు సానుకూలంగా స్పందించినపుడే దైవరాజ్య ప్రవేశార్హత మనకు లభిస్తుంది!

**ముగింపు:**

అబద్ధాలతో మనం అందర్నీ నమ్మిచినా దేవుణ్ణి నమ్మించలేం. తన దివ్యసంకల్పానికీ తాను నిర్దేశించిన జీవన ప్రణాళికకు అనుగుణంగా చిత్తశుద్ధితో అంకితభావంతో జీవించే వారినే దేవుడు నమ్ముతారు, ఆదరిస్తారు, నిత్యజీవాన్ని బహుకరిస్తారు. యేసుప్రభువు అలాగే జీవించారు. తనకు ఎన్నికష్టనష్టాలు ఎదురైనా, ఎన్ని శ్రమలను భరించవలసిన వచ్చినా, చివరికి సిలువ మరణానికి గురికావలసి వచ్చినా యేసు ప్రభువు తన తండ్రి సంకల్పానికే కట్టుబడి జీవంచారు, తండ్రి సంకల్పాన్నే నెరవేర్చారు.

ఈనాడు ప్రభువు తన వలె జీవించుమనొ మనలోని ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నారు, దేవుని చిత్తానికీ క్రైస్తవ విలువలకూ కట్టుబడి జీవించుమని కోరుతున్నారు.

# సామాన్య 27 వ ఆదివారం
# 08-10-2017

***యెషయా 5:1-7 ఫిలిప్పీ 4:6-9 మత్తయి 21:33-43***

ఈనాటి మొదటి పఠనంలోను, సువార్తా పఠనంలోను మనకు మానవ రక్షణ చరిత్ర సంక్షిప్తంగా కనిపిస్తుంది. అలాగే "మూలరాయి" క్రీస్తు యేసులో అంతర్భాగాలుగా మనుగడ సాగించేవారే క్రైస్తవులవుతారన్న సరికొత్త నిర్వచనమూ మనకీనాటి పఠనాలలో స్పష్టమవుతుంది.

యేసుప్రభువు కేవలం పునాది రాయి మాత్రమే కాదు. ఆయనొక "మూలరాయి" ఈ మూలరాయి పైననే భవంతిలోని రాళ్ళన్నీ ఆధారపడి ఉంటాయి, మూలరాయితో అవిభాజ్యమైన అనుబంధాన్ని కలిగి ఉంటాయి. క్రైస్తవులంతా ఈ సత్యాన్ని గుర్తించాలి, తమను తాము తెలుసుకోవాలి. క్రైస్తవులు ఇప్పుడు "మూలరాయి" యేసుక్రీస్తు ప్రభువు ద్వారా దేవుని సహవాసంలో మనుగడ సాగిస్తున్నారు, "నూతన రాజ్య" (మత్తయి 21:43) మైన శ్రీసభ నిర్వర్తించే అపోస్తలిక సేవల ద్వారా క్రైస్తవులు నిరంతరమూ దేవుని సాహచర్యంలో జీవించగలుగుతారు. ఈ మహదవకాశాన్ని క్రీస్తు ప్రభువే వారికి అనుగ్రహించారు.

## మొదటి పఠనం: యెషయా 5:1-7

ఈనాటి మొదటి పఠనంలో మనం యెషయా ప్రవక్త క్రీ.పూ. 750 ప్రాతంలో రాసిన "ద్రాక్షతోట పాట" ను చదువుతున్నాం. బైబులు గ్రంథంలో దైవరాజ్యాన్ని సూచిస్తూ ప్రయోగించిన ప్రతీకలన్నింటిలోను ఈ "ద్రాక్షతోట" ప్రతీక ఎంతో ప్రసిద్ధిని పొందింది. దైవ ప్రజల చరిత్రనంతటినీ ప్రతీకాత్మకమైన ఈ "ద్రాక్షతోట పాట" ద్వారా పలికించడం అపురూపమైన విషయం. విశేషం.

యెషయా ప్రవక్త దేవుణ్ణి తన మిత్రుడుగా పరిచయం చేయడంతో పాట ఆరంభమవుతుంది. ఆ చెలికానికొక ద్రాక్షతోట ఉంటుంది. అలాగే పాట 7వ వచనంలో ప్రవక్త తన చెలికానికి జరిగిన ఆశాభంగాన్ని తలచుకొని చింతాక్రాంతుడు కావడంతో పాట ఆగిపోతుంది.

ఇకపోతే పాట మధ్య భాగంలో స్వయంగా దేవుడే తనకు కలిగిన మనస్తాపాన్ని వేధనాభరితంగా వ్యక్తం చేస్తారు. తోట యజమానుడైన దేవుడు రుచికరమైన ద్రాక్షపంటకోసం తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుంటారు, ఎంతో శ్రమపడి పనిచేస్తారు; తోట నడుమ బురుజు కట్టి కావలికాస్తారు. తీయతీయని రుచులతో విస్తారమైన పంట చేతికొస్తుందన్న ఆశతో "రసముతీయుట" కొరక తొట్టిని కూడా తొలిపిస్తారు. ఇంత చేసినా ఆ ద్రాక్షతోట పుల్లని కాయలు కాచింది. తోట యజమానుడు హుతాశుడయ్యాడు.

అలాగే దేవుడు ఇస్రాయేలీ ప్రజలను ప్రత్యేకంగా ఎన్నుకున్నారు, వారినొక జాతిగా మలిచారు, విమోచించారు, నడిపించారు, ఎన్నో మహోపకారాలు చేశారు. అయినా దేవుడు ఎన్నుకున్న ప్రజలు దేవుడికి బదులు లోకాన్ని ఎంచుకున్నారు. ఇచ్చిన మాటకు దేవుడు కట్టుబడి ఉన్నాడే గానీ, ప్రజలెప్పుడో కట్టుబాటు తప్పారు. ప్రజా జీవనాన్ని క్రమబద్ధం చేయడానికీ వారిని పుణ్యమార్గంలో నడుపడానికీ దేవుడు మోషే ద్వారా ధర్మచట్టాన్ని ప్రసాదిస్తే, ప్రజలు ఈ చట్టాని కూడ అతిక్రమించి దేవుణ్ణే ధిక్కరించడానికి తెగబడ్డారు. అప్పుడు దేవుడు తన ప్రజలను రుజు మార్గంలో నడిపించడానికి ప్రవక్తలను నియమించారు. కానీ ప్రజలు ఈ ప్రవక్తల మాటలనుసైతం ఖాతరు చేయలేదు, రుజు మార్గంలో నడువ లేదు. తన ప్రజలు తన కోసం, తన పవిత్రా వరం కోసం వెదకుకుంటూ వస్తారని దేవుడు ఆశించారు, కానీ, ప్రజలాయనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు, ఆయనకు ఎప్పుడూ ప్రతికూలంగానే నడుస్తూ వచ్చారు.

దేవుడు అపారమైన కారుణ్యానికీ, మానవులు అనంతమైన దార్షీకానికీ ఈ పాట అక్షరాల అద్దం పడుతుంది. ఈనాటి సువార్త పఠన సారాంశం కూడా దాదాపు ఇలాగే ఉంటుంది. అయితే ఈ రెండు పఠనాలను ధ్యానపూర్వకంగా ఆలకించిన క్రైస్తవులు క్రీస్తు మరణ పునరుత్థాన ఘట్టాల ద్వారా దేవుడు తమకోసం చేసిన మహత్కార్యాలను గుర్తించాలి, ఆయనను మరోమారు నిరాశపరచకుండా జాగ్రత్త పడాలి. కరుణామయుడైన దేవుడు తాను చేయవలసినదీ, చేయగలిగినదీ అంతా చేశారు; అందుకు సముచితంగా స్పందించవలసిన బాధ్యత ఇక క్రైస్తవులమైన మన మీదనే ఉంటుంది.

## రెండవ పఠనం: ఫిలిప్పీ 4:6-9

ఫిలిప్పీ క్రైస్తవులు పౌలు సువార్తా ప్రచారానికి అనేక విధాలుగా సాయం చేశారు; ఆధ్యాత్మికంగాను సహాయం చేశారు, ఆర్థికంగాను ఆయనకు చేయూత మందించారు. కనుక పౌలు వారికెంతో రుణపడి ఉన్నాడు. వారు తనకు చేసిన సహాయానికి గాను ఫిలిప్పీయులకు పౌలు పలుమార్లు కృతజ్ఞతలు తెలియజేశాడు.

అలాగే ఈ పఠనంలో కూడా ఫిలిప్పీయులకు కృతజ్ఞతలు తెలియజేసే ముందు “దేవుని పట్ల సదా కృతజ్ఞులై ఉండండి” అంటూ వారిని ఉద్బోధిస్తున్నాడు; ఇలా దేవునికి ఎల్ల వేళలా కృతజ్ఞతలు తెలియజేయడం వలన క్రైస్తవులకు కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఎలాంటివో కూడా వివరిస్తున్నారు.

**మొదటిది:** క్రైస్తవులు దేని గురించీ విచారించనవసరం లేదు, చింతిచరాదు; వారికి అవసరమైన వాటి కొరకు దేవుని ప్రార్థించాలి, ఆయన సహాయాన్ని అర్థించాలి. అయితే ఇలా దేవునికి చేసే ప్రార్థనలు నిందాపూర్వకమైన ప్రార్థనలు కారాదనీ, అవి “కృతజ్ఞతా పూర్వకమైన” ప్రార్థనలు కావాలనీ పౌలు ప్రభోధిస్తున్నాడు. దేవుడు గతంలో తమకు చేసిన ఉపకారాలన్నింటినీ మననం చేసుకుంటూ దేవునికి ధన్యవాదాలు తెలియజేయాలని చెబుతున్నాడు. ఇలా “కృతజ్ఞతా పూర్వకంగా” చేసే మనవి ప్రార్థనలు క్రైస్తవులకు దేవునిపట్ల గల దృఢ విశ్వాసానికి సంకేతాలుగా నిలుస్తాయి; అంతేకాదు గతంలో తమను అనేక పర్యాయాలు ఆదుకున్న దేవుడు ఇప్పుడు కూడా తమ ప్రార్థనలు ఆలకించి సకాలంలో తమకు సమాయం చేస్తారనే నమ్మకం ఈ “కృతజ్ఞతా ప్రార్థనల” ద్వారా వ్యక్తమవుతుంది.

**రెండవది:** ఇలా కృతజ్ఞతాపూర్వకమైన హృదయాలతో చేసే ప్రార్థన క్రైస్తవులకు, దేవుని శాంతిని బహుమానంగా అందజేస్తుంది; దేవుడనుగ్రహించే ఈ శాంతి అపురూపమైనది మాత్రమే కాదు, “మానవ అవగాహనకు” అందనిది కూడా; దేవుడు ప్రసాదించే ఈ శాంతి ప్రాణాంతక పరిస్థితులలో కూడ విశ్వాసులను నిశ్చలంగా నిలుపుతుంది, వారి అంతరంగాలలోని సమాధానాన్ని చెక్కు చెదరకుండా కాపాడగలుగుతుంది, అంతేకాదు దేవుని శాంతి వరాన్ని పొందిన క్రైస్తవులు ఎక్కడ ఎలాంటి స్థితిగతులలో ఉన్నప్పటికీ నీతి నియమాలకు కట్టుబడి జీవించగలుగుతారు, పదుగురుకీ ఆదర్శప్రాయులవుతారు.

ఇక్కడే ఫిలిప్పీయులకు మరో విషయం కూడా మనవి చేస్తున్నాడు పౌలు. భక్తి జీవనంలో తాను "పరిపూర్ణుడు" కాదని పౌలుకు తెలిసినప్పటికీ (3:-12-16) తనను అనుసరించుమనీ, తన "మాటల నుండియు, చేతల నుండియు" తగిన పాఠాలు నేర్చుకొమ్మనీ ఫిలిప్పీయులను కోరుతున్నాడు. ఎందుకంటే తాను పరిపూర్ణుడు కానప్పటికీ తాను కొనసాగించే అపోస్తోలిక ధర్మాలన్నింటిలోను సాక్షాత్తూ యేసుప్రభువే ప్రత్యక్షపరుపబడుతున్నారని పౌలు నమ్మకం. కనుక తన మాటలను తన చేతలను అనుసరించే క్రైస్తవులు సైతం తమ దైనందిన జీవితాలలో క్రీస్తు ప్రభువును సాక్షాత్కరింప జేసికొనగలుగుతారు, ప్రభు సాక్షులుగా జీవించగలుగుతారు. ఈ ఉద్దేశ్యంతోనే పౌలు తన అడుగు జాడలలో నడువమనీ, దేవుని సాహచర్యాన్ని పొందుమనీ ఫిలిప్పీయులకు హితవు చెబుతున్నాడు.

## సువార్త పఠనం: మత్తయి 21:33-43

ఈనాటి సువార్త పఠనంలో మనం చదువుతున్న "భూస్వామికౌలుదార్లు" ఉపమానాన్ని కూడా యేసుప్రభువు యూదమత నాయకులను ఉద్దేశించే చెప్పారు. ప్రధానార్చకులు, యూద ప్రజానాయకుల నుద్దేశించి "ఇద్దరు కుమారుల ఉపమానం" చెప్పిన వెంటనే ఈ కిరాతకులైన కౌలుదార్లు" ఉపమానం చెప్పడం గమనార్హం.

ఈ ఉపమానం కూడా "ద్రాక్షతోట" కు సంబంధించినదే ఇస్రాయేలీ జాతి ప్రభువైన దేవుడు నాటిన "ద్రాక్షతోట" వంటిదని యూదులందరికీ తెలుసు, కనుక ప్రజలెరిగిన ప్రతీకనే ఆధారం చేసుకొని యేసుభ్రువు ఈ ఉపమానం చెప్పారు. ఈ ఉపమానం ద్వారా ఇస్రాయేలీయులను ముఖ్యంగా యూదమత నాయకులను ఆత్మశోధనకు పురికొల్పాలనే ఉద్దేశ్యంతోనే ప్రభువీఉపమానం చెప్పారన్నది స్పష్టం.

ఆకాలంలో పాలస్తీనాలోని భూస్వాములు తమ పొలాలను కౌలు దారులకిచ్చి దూర ప్రాంతాలకు తరలిపోవడం సర్వసాధారణం. అలాగే దూరప్రాంతాలలో ఉండే యజమానులు ఏడాదికోసారి కౌలుదార్లు దగ్గరికి తమ మనుషులను పంపి కౌలు వసూలు చేయించుకొనేవారు. అతి సాధారణమైన ఈ విషయాన్ని ఆధారం చేసుకొని ప్రభువు అసాధారణమైన ఉపమానానికి రూప కల్పన చేశారు

ఈ ఉపమానంలోని "ద్రాక్షతోట" ఇంతకు ముందు చెప్పుకున్నట్టు ఇస్రాయేలీ ప్రజలకు ప్రతీక అయితే, తోట యజమానుడు ప్రభువైన దేవుడు, యూదమత నాయకులే కౌలుదార్లు. స్వయంగా దేవుడే తమ ప్రజలను యూదమత నాయకులకు అప్పగించారు. ప్రజలు పది ఆజ్ఞలను నిష్ఠగా పాటిస్తూ ధర్మబద్ధమైన జీవనం గడిపేలా చూడడం మత నాయకుల కర్తవ్యం. అలా దేవుని ఆజ్ఞలకు విధేయులుగా పుణ్య జీవనం గడిపే దైవ ప్రజలే ద్రాక్షతోటలో కాసిన "రుచికరమైన పండ్లు".

ఈ ఉపమానంలో యజమానుడు పంపిన "సేవకులు" మరెవరో కారు ప్రవాస జీవనానికి ముందు, ఆ తరువాత ఇస్రాయేలీ ప్రజలకు దైవోపదేశాలను అందజేసిన ప్రవక్తలు. ఆనాడు యూదమత నాయకులు ప్రవక్తలను హింసించి వధించినట్లే, ఉపమానంలోని కౌలుదార్లు యజమానుడు పంపిన సేవకులను కొట్టి హింసిస్తారు, చంపి కక్ష తీర్చుకుంటారు.

చివరికి ద్రాక్షతోట యజమానుడు "కౌలు" వసూలు కోసం తన కుమారుణ్ణే పంపిస్తారు. యజమానుడు పంపిన ఆ కుమారుడు "యేసుప్రభువే" అన్న సత్యం ఈ దశలో అందరికీ స్పష్టమవుతుంది. అంటే ఈ ఉపమానం ద్వారా యేసుప్రభువు తానే "దైవకుమారు" డన్న సత్యాన్ని యూదమత నాయకులకు బుద్ధి పూర్వకంగానే వెల్లడిస్తున్నారు. అంతేకాదు తనను దైవ కుమారుడుగా అంగీకరించి ముక్తిభాగ్యాన్ని పొందుమని యూద మత పెద్దలను స్వయంగా ప్రభువే ఆహ్వానిస్తున్నారు.

అయినా ప్రభువు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఎప్పటిలాగే యూదమత నాయకులు యేసుప్రభువును తృణీకరించారు, ఆయన సందేశాలను ఆమోదించడానికి బదులు నిరాకరించారు. అయితే మత నాయకుల తిరస్కారంతో యేసుప్రభువు కుంగిపోలేదు. నాయకులిప్పుడు తనను తృణీకరిస్తారని ప్రభువుకు ముందుగానే తెలుసు. అలాగే తన మరణ పునరుత్థానాల అనంతరం తండ్రి దేవుడే తన తత్వమహత్వాలను లోకానికి వెల్లడిస్తారని కూడ ప్రభువుకు తెలుసు.

ఈ ఉపమానం తొలి భాగంలో యజమానుడు కోత కొచ్చిన పంటలో తనకు రావలసిన భాగాన్ని తెమ్మని సేవకులను పంపిస్తాడు. అంటే తాను కౌలుకిచ్చిన ద్రాక్ష తోటలో పంట పండిదని యజమానుడు ఊహించాడు కానీ కౌలుదార్లు ఆధీనంలో

ఉన్న ద్రాక్ష తోటలో ఎలాంటి పంటా పండలేదని చివరి వచనాన్ని చూస్తే బోధపడుతుంది. ద్రాక్షతోట "మీ నుండి తొలగింపబడి, తగిన ఫలముల నిచ్చువారికి ఈయబడును"

దీనిని ఇస్రాయేలీ ప్రజలకు, మత నాయకులకు అన్వయించి చూస్తే మత నాయకుల ఏలుబడిలో ఇస్రాయేలు జాతి నిష్ఫలమైనదనీ, ప్రభువైన దేవుడు ఇస్రాయేలు జాతి నుంచి కోరుకున్న "రక్షాఫలము" లేవీ చేతికి అందలేదనీ బోధపడుతుంది. కనుకనే రక్షాఫల సాధన కోసం ఇస్రాయేలు నాయకత్వాన్ని మార్చవలసిన అవసరమేర్పడింది.

ఈ మేరకు దైవ సంకల్పానుసారం నేడు దైవప్రజలకు నాయకత్వం వహిస్తున్నది మన సత్య శ్రీసభ. సాక్షాత్తూ క్రీస్తు ప్రభువే నడిపిస్తోన్న శ్రీసభే నేఏడు తన అపోస్తోలిక సేవల ద్వారా ముప్పదంతలు, ఆరువందతలు, నూరంతలుగా "ఫలసాయాన్ని" పొందగలుగుతున్నది.

ఇంతకూ శ్రీసభ అనే ద్రాక్ష తోట లోకానికందించే రుచికరమైన ఫలాలూ అంటే ఏమిటి? అవి ఎవరికి సంకేతాలు!? పవిత్రాత్మ ద్వారా పితాపుత్రులసహవాసంలో పుణ్యజీవనం గడిపే క్రైస్తవులే శ్రీసభ వనంలో వర్థిల్లుతోన్న స్వాతుఫలాలు!

**ముగింపు:**

నిజమే. దేవుడు ప్రేమసాగరుడు, దయామయుడు: కానీ వంచకులు చేసే అక్రమాలను ఆయన ఎల్లకాలమూ చూస్తూ ఊరుకోరు. తగిన సమయంలో వారిని తప్పక శిక్షిస్తారు. ఇదే సత్యాన్ని ఈనాటి మొదటి పఠనం, మూడవ పఠనం కూడా స్పష్టం చేస్తున్నాయి.

ఒకవేళ దేవుడు ఈరోజే మన తప్పొప్పులను తీర్మానించడానికి పూనుకున్నారనుకోండి; ఆయన మనల్ని ఏ వర్గంలోకి చేర్చుతారు? మనల్ని ఆయన "మంచి సేవకుల" కోవలో చేర్చుతారా? వంచకులైన సేవకులుగా గుర్తించి శిక్షిస్తారు?

ఇప్పటికైనా సమయం మించిపోలేదు. దేవుని చిత్త ప్రకారం మన బతుకు బాటల్ని దిద్దుకుందాం, దేవుని కోపాగ్ని నుంచి తప్పించుకుందాం!

# సామాన్య 28వ ఆదివారం
# 15-10-2017

***యెషయా 25:6-10  ఫిలిప్పీ 4:12-14,19-20  మత్తయి 22:1-14***

దివ్యవిందు (దివ్యపూజ) లో సాక్షాత్తూ యేసుక్రీస్తు శరీర రక్తాలను భుజించడం ద్వారా మనం ప్రభుక్రీస్తును ధరించిన వారమవుతున్నాం. దివ్యసత్ప్రసాత స్వీకరణం ద్వారానే మనం ప్రభుక్రీస్తు పవిత్రతా సుగుణాన్నీ ఆయన దివ్యశక్తినీ పొంది పవిత్రమైన జీవనం గడపగలుగుతాం. దేవుడు మనకు అనుగ్రహించబోయే నిత్యజీవభాగ్యాన్ని స్వీకరించడానికీ, నిత్యానందాన్ని మనలో నిలుపుకోడానికీ యోగ్యులం కాగలుగుతాం. ఆవిధంగా దివ్యవిందు ద్వారా మనం పరిపూర్ణమైన రక్షణ ఫలాన్ని ముందుగానే చవిచూడగలుగుతాం. దైవరాజ్య పూర్ణావిష్కరణ అనుభూతిని పొందగలుగుతాం.

**మొదటి పఠనం: యెషయా 25:6-10**

ఈనాటి మొదటి పఠనంలో మనం "అభిషిక్తుడు వేంచేయుకాలమున జరుగు విందు" గురించి యెషయా పలికిన ప్రవచనాలను చదువుతున్నాం. యెషయా గ్రంథంలోని "ద్రాక్షతోట" దేవుడు ఎన్నుకొనిన ఇస్రాయేలీ జాతికి సంకేతమైతే, అభిషిక్తుడు వేంచేసే తరుణంలో జరుగబోయే ఈ "మహావిందు" తన ప్రజలకు దేవుడు అనుగ్రహించబోయే రక్షణ భాగ్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

యేసుప్రభువు సైతం దైవరాజ్య స్వభావాన్ని వివరించే సందర్భంలో ఈ "మహావిందు" ను ఒక ప్రతీకగా ఉపయోగించారు. దీనిని ఆయన "వివాహవిందు" తో సరిపోల్చారు.

యెషయా ప్రవక్త పలుమార్లు ఇస్రాయేలీయుల విశ్వాస ఘాతుకాన్నీ, దైవధిక్కార స్వభావాన్ని, ప్రాపంచిక విషయలౌల్యాన్నీ ఖండించిన మాట వాస్తవమే. అయితే తిరిగి ఆయనే మెస్సయా ప్రభు ఆగమనం గురించీ, మెస్సయా రాజ్య అవతరణం గురించీ, మెస్సయా యుగ ఆవిర్భావం గురించీ కూడా స్పష్టంగా ప్రవచించాడు. మెస్సయా రాజ్యాన్నే ప్రవక్త "పరలోక యెరూషలేము నగర" మన్నాడు; దైవప్రజా సంఘ ఆవిష్కరణమని దాని అంతరార్థం.

దైవప్రజలు రక్షణభాగ్యాన్ని పొందడం ఎలా అనివార్యమో, దైవధిక్కారులు మోవాబు విచ్ఛిన్నమైనట్లు వినాశం పాలుకావడమూ అనివార్యమే; అప్పుడు మృత్యువు పరాజయం పాలవుతుంది, సర్వత్రా ఆనందం, నవజీవం వెల్లివిరుస్తాయి.

ఆ శుభతరుణంలోనే "సర్వశక్తిమంతుడైన ప్రభువు సకలజాతులకును విందు సిద్ధం" చేస్తారు. అంటే లోకంలోని మానవులందరు దేవుడు ఇచ్చే పారలౌకిక విందుకు ఆహ్వానించబడతారు. దీనిని బట్టి దేవుడు ఎన్నుకొనిన ఇస్రాయేలీ ప్రజలు మాత్రమే ఈ విందుకు ఆహ్వానింపబడతారనుకోవడం పొరపాటని అర్థమవుతుంది; దేవుని శత్రువులెవరికీ ఈ మహావిందులో పాల్గొనే అవకాశమే ఉండదని కూడా మనం గ్రహించాలి.

ఈనాటి సువార్త పఠనంలో మనం చదవబోతోన్న "పెండ్లి విందు" ఉపమానాన్ని అర్థం చేసుకోవడానికి, దాని అంతరార్థన్ని గ్రహించడానికీ ఈ మొదటి పఠనం దోహదం చేస్తుంది.

ఇక్కడ మనం గుర్తుంచుకోవలసిన ప్రధానాంశమేమిటంటే ఆనాడు యెషయా ప్రవక్తకు కలిగిన అద్భుత దర్శనం. ఆ దర్శనంలో ఆయన కళ్ళారా చూచి ప్రవచించిన "పరలోకవిందు" విశేషాలన్నీ నేడు శ్రీసభలో కొనసాగుతోన్న దివ్యవిందు సంస్కారం ద్వారా నెరవేరుతున్నాయి.

## రెండవ పఠనం: ఫిలిప్పీ 4:12-14,19-20

పునీత పౌలు ఐరోపా ఖండంలో స్థాపించిన మొట్టమొదటి క్రైస్తవ సంఘం ఫిలిప్పీ క్రైస్తవ సంఘం. ఈ సంఘాన్ని ఆయన క్రీస్తుశకం 52లో స్థాపించాడు. ఆయన ఫిలిప్పీయులకు రాసిన లేఖలోని భాగాలనే గత కొన్ని వారాలుగా మనం దివ్యపూజ రెండవ పఠనాలలో చదువుతూ వస్తున్నాం.

పౌలు తన సువార్తా ప్రచార నిర్వహణకుగానీ, తన వ్యక్తిగత పోషణకు గానీ ఇతరుల సాయం మీద ఆధారపడేవాడు కాడు; కష్టపడి చెమటోడ్చి తనకు అవసరమైన ఆర్థిక నిధులను సమకూర్చుకొనేవాడు. అంతేగానీ తన భారాన్ని క్రైస్తవులపైనా క్రైస్తవ సంఘాలపైనా మోపడానికి ఇచ్చగించేవాడు కాడు. కష్టపడి చెమటోడ్చి తనకు అవసరమైన ఆర్థిక నిధులను సమకూర్చుకొనేవాడు ఒక అపోస్తలుగా తన జీవితం మీద సిలువనాథుని పేదరికం, నిరాడంబరత్వం ముద్రితమై ఉండాలని పౌలు కోరుకునేవాడు. గనుకనే తాను ఎక్కడికి వెళ్ళినా అక్కడున్న క్రైస్తవ సంఘాలకు "మార్గదర్శి" గా ఉండేందుకు ప్రయత్నించేవాడు అంతేకాని వారికి భారంగా మారేవాడు కాడు. లేమిలో కినుకవహించడం, కలిమిలో మిడిసిపడటం పౌలు స్వభావానికి విరుద్ధం; కలిమిలేములను ఆయన సమదృష్టితో చూచేవాడు. స్థితప్రజ్ఞుడాయన. అంతేకాదు తన మనుగడకు తన శక్తిసామర్థ్యాలకు తాను నిర్వర్తించే ధార్మిక క్రియలన్నింటికీ మూల కారకుడు, సూత్రధారి,

ఆధినాయకుడు, యేసుప్రభువే అన్న నమ్మకమే పౌలును స్థితప్రజ్ఞుణ్ణి చేసింది. అలాగే తనను చూచి క్రైస్తవ విశ్వాసులందరు ప్రభుక్రీస్తుపై ఆధారపడి జీవించడం నేర్చుకోవాలని పౌలు కోరుకొనేవాడు.

ఇలా ఎల్లవేళలా స్వావలంబనను నమ్మి తన స్వశక్తిపై తాను ఆధారపడుతూ వచ్చిన పౌలు ఒకసారి ఫిలిప్పీయులు ఎపఫ్రోదితు ద్వారా పంపిన ఆర్థిక సహాయాన్ని స్వీకరించవలసి వచ్చింది అందుకాయన వెంటనే ఫిలిప్పీయులకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశాడు.

అదే సమయంలో క్రైస్తవుల మనుగడకు, వారి జీవన పురోగమనానికీ యేసుక్రీస్తు ప్రభువే మూలాధారుడనీ, "క్రీస్తు అనుగ్రహించు శక్తి" పైననే వారు ఆధారపడి జీవించాలనీ ఉద్బోధించడం మరచేవాడు కాడు; తమ జీవితావసరాలన్నింటినీ క్రీస్తు యేసు ద్వారా తీర్చుతూ తమను కాపాడి నడిపించుమని తండ్రి దేవుని ప్రార్థించవలసినదిగా పౌలు క్రైస్తవులందరికీ హితవు చెప్పేవాడు.

## సువార్త పఠనం: మత్తయి 22:1-14

ఈనాటి సువార్త పఠనం ఆధారంగా ప్రబోధించదలచుకున్న గురువులు ముందుగా రెండు విషయాలను తెలుసుకోవాలి.

**మొదటిది:** ఈ సువార్తా భాగంలో (22:1-14) రెండు ఉపమానాలున్నాయి. ఒకటి "పెండ్లివిందు", రెండవది "వివాహవస్త్రం". పునీత లూకా సువార్తలోను, పునీత తోమాసు రాసిన అనధికార సువార్తలోను ఒకటవ ఉపమానం(పెండ్లి విందు) మాత్రమే విడిగా కనిపిస్తుంది. మత్తయి సువార్తలో మాత్రమే మనకు మొదటి ఉపమానంతో పాటు రెండవ ఉనమానం కూడా కనిపిస్తుంది.

మత్తయి సువార్తలో ఈ రెండు ఉపమానాలను కలిపి చెప్పడం వలన సహజంగానే మనకొక అనుమానం కలుగుతుంది, ఒక ప్రశ్న మనల్ని వేధిస్తుంది. అదేమిటంటే: "పురవీధులలో కనబడిన వారందరినీ విందుకు తీసుకురమ్మని చెప్పిన రాజు ఎలాంటి సిద్ధపాటు లేకుండా వచ్చిన పేదవాళ్ళు వివాహవస్త్రాలు ధరించి వస్తారని ఎలా ఊహిస్తారు? అలా వివాహవస్త్రం లేకుండా వచ్చిన బీదవాడొకడిని బంధించి శిక్షించడం న్యాయమేనా?" ఈ ప్రశ్న తలెత్తడానికి కారణం పై రెండు ఉపమానాలను జోడించి చెప్పడమేనని ఇంతకుముందే చెప్పుకున్నాం. నిజానికి రెండవ ఉపమానాన్ని విడిగా చెప్పుకుంటే మనకు అందే సందేశం వేరు. దైవరాజ్యం సంపూర్ణంగా అవతరించే గడియ సమీపించేనాటికి ప్రజలంతా సిద్ధంగా

ఉండాలనీ, దైవరాజ్య ప్రవేశానికి అన్నివిధాలుగా యోగ్యులై ఉండాలనీ బోధించే సందర్భంలో బహుశా యేసుప్రభువు ఈ ఉపమానాన్ని చెప్పి ఉంటారు.

అయితే మరికొన్నిసార్లు స్వయంగా యేసుప్రభువే ఈ రెండు ఉపపమానాలను కలిపి చెప్పి కూడా ఉండవచ్చును. ఇలా కలిపి చెప్పినా, విడివిడిగా చెప్పినా ఇవి పరస్పరం భిన్నమైన ఉపమానాలనీ, అవి బోధించే సందేశాలు కూడా వేర్వేరుగానే ఉంటాయనీ బోధకులు తెలుసుకోవాలి.

**రెండవది:** "పెండ్లి విందు" ఉపమానం విషయానికి వస్తే లూకా సువార్తలో కనిపించే వృత్తాంతానికీ, మత్తయి సువార్తలో కనిపించే వృత్తాంతానికీ కొన్ని వ్యత్యాసాలు కనిపిస్తాయి. ముఖ్యంగా మత్తయి  ఈ ఉపమానంలో అసహజమైన, ఆశ్చర్యకరమైన వివరాలను కొన్నింటిని జోడించాడు. ఉదాహరణకు ఈ "పెండ్లివిందు"ను ఒకరాజు తన కుమారుని వివాహ సందర్భంగా ఏర్పాటుచేస్తాడు; విందుకు ఆహ్వానింపబడిన అతిథులు ఆఖరి నిమిషంలో ఏవేవో సాకులు చెప్పి విందుకు రావడానికి నిరాకరిస్తారు. అంతేకాదు తమను ఆహ్వానించడానికి వచ్చిన రెండు బృందాల సేవకులను దారుణంగా హతమార్చుతారు. ఆ విషయం తెలిసిన రాజు తన సేవకులను పంపి ఆహ్వానాన్ని మన్నించని అతిథులను మట్టుపెట్టించి వారి పట్టణాలను ధ్వంసం చేయిస్తాడు.

మత్తయి జోడించిన ఈ విశేషాలను పరిశీలిస్తే ఇది సంకేతప్రాయమైన కథనమనీ, దేవుడు ఇస్రాయేలీ ప్రజలను ఎన్నుకున్న ఘట్టం నుంచి రానున్న కాలంలో జరుగబోయే యెరూషలేము పతననం వరకు జరిగిన జరుగబోతున్న రక్షణ చరిత్రకిది సంక్షిప్తరూపమని స్పష్టమవుతుంది. దైవప్రజలైన ఇస్రాయేలీయులు దైవకుమారుణ్ణి తిరస్కరించి చేసిన అపరాధానికి శిక్షగానే యెరూషలేము పతనమవుతుందని ప్రభువిక్కడ ప్రవచిస్తున్నారు.

ఇక ఉపమానంలోని వివరాలకు వస్తే "పెండ్లి విందు" కు రాజు ఇచ్చిన ఆహ్వానం, దేవుడు దైవరాజ్య నిర్మాణానికి ఇస్రాయేలీయులకిచ్చిన పిలుపు వంటిది. అవును. తాను ఎన్నుకున్న ఇస్రాయేలీ ప్రజల ద్వారానే దేవుడు తన రాజ్యాన్ని ఆవిష్కరించదలచుకున్నారు. కాని వారు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు, దైవధిక్కారానికి పాల్పడ్డారు.

రాజు పంపిన రెండు బృందాల సేవకులు వరుసగా దేవుడు పంపిన ప్రవక్తలు, అపోస్తలులు, క్రైస్తవ సువార్తా ప్రచారకులు. వీరందరిని యూదులు హింసించి హతమార్చారు. ఉపమానంలోని సేవకులు ఆహ్వానితులైన అతిథుల చేతిలో మరణించినట్లు అపోస్తలులు సువార్తా ప్రచారకులు వేదహింసలకుగురై హతస్సాక్షులుగా మరణించారు.

ఈ పరిణామాలను ముందుగానే దర్శించిన యేసుప్రభువు దైవ సేవకులను

హతమార్చిన వారికి రాబోయే శిక్షలెలాంటివో స్పష్టంగా ప్రకటించారు. పూర్వనిబంధన కాలంలో ప్రధాన నగరాలు నాశనమైనప్పుడు అది దేవుడు వేసిన శిక్షగానే ప్రజలు భావించేవారు. ఇదే భావాన్ని రూఢిపరుస్తూ యేసుప్రభువు యెరూషలేము పతనాన్ని గురించి ముందే ప్రవచించారు. ప్రభువు పలికిన ఈ ప్రవచనం క్రీస్తు శకం 70లో నెరవేరింది; రోమను సేనల దాడుల్లో యెరూషలేము నేలమట్టమయింది. అయితే అత్యంత కీలకమైన ఈ ప్రవచనాన్ని ప్రభువు ఒక ఉపమానంలో భాగంగా చెప్పడం విశేషం.

అలాగే దైవరాజ్యంలో అన్యజనుల ప్రవేశానికి సంబంధించిన ప్రవచనాన్ని కూడా ప్రభువు ఈ ఉపమానం ద్వారానే ప్రకటించడం మరో విశేషం. యూదుల దృష్టిలో అన్యజనులు దైవరాజ్య ప్రవేశానికి అనర్హులు, అయోగ్యులు. అయితే ఎన్నుకోబడిన వారు దైవాదేశాన్ని ధిక్కరించినపుడు అన్యజనులే దైవరాజ్యానికి ఆహ్వానింపబడతారని, ఈ ఉపమానం ద్వారా ప్రభువు ప్రకటిస్తున్నారు. ఈ ఉపమానంలో రాజమార్గాల నుంచీ, పురవీధులనుంచీ "విందు" కు రావించబడిన దీనజనులందరు "దైవరాజ్యం" లో ప్రవేశించబోయే అన్యజనులకు సంకేతాలుగా నిలుస్తున్నారు.

అలాగే యేసుప్రభువు ఈ రెండు ఉపమానాలను కలిపి చెప్పడం ద్వారా మరో సత్యాన్ని కూడా స్పష్టం చేస్తున్నారు. అదేమిటంటే ఇస్రాయేలీయులు "దైవప్రజలుగా" కొనసాగే దశ దాటిపోయిందనీ, "దైవరాజ్యా"నికి ప్రతినిధిగా ప్రతిరూపంగా శ్రీసభ అవతరించిందనీ, నవయుగం ఆరంభమైందనీ ప్రభువు పరోక్షంగా వెల్లడిస్తున్నారు. గతంలో "ద్రాక్షతోట – కౌలుదార్లు" ఉపమానం ద్వారా కూడ ప్రభువు ఇదే సత్యాన్ని ప్రకటించారు.

**మూడవది**: ఈ జంట ఉపమానాలు మనకు మరో ప్రధాన సత్యాన్ని కూడా బోధిస్తున్నాయి. అదేమిటంటే దేవుని రక్షణభాగ్యం అందరికీ అందుబాటులో ఉంటుంది గానీ, దేవుని శత్రువులకు, దైవధిక్కారులకు మాత్రం అది లభ్యం కాదు. అంటే దేవుడనుగ్రహించే రక్షణవరం యాంత్రికంగా మానవులందరికీ లబించదు; వారు పేదలైనా, పీడితులైనా అట్టడుగు వర్గాలవారైనా తగిన యోగ్యత లేకపోయినట్లయితే వారు రక్షణ పొందలేరు, ముక్తిభాగ్యాన్ని స్వంతం చేసుకోలేరు.

లోకాంత్యదశలో దైవరాజ్యంలో ప్రవేశించడానికి, రక్షణ పొందడానికి మానవులందరూ ఆహ్వానించబడతారు. కానీ ఆహ్వానించబడిన వారందరు రక్షణ పొందలేరు. ఆహ్వానాన్ని అందుకున్న వారు తమను తాము అందుకు యోగ్యులుగా తీర్చిదిద్దుకుంటేనే రక్షణభాగ్యాన్ని పొందగలుగుతారు.

రెండవ ఉపమానంలో "వివాహవస్త్రం" ఆహ్వానింపబడినవారు తమలో

పెంపొందించుకోవలసిన "యోగ్యత"కు ప్రతీకగా నిలుస్తుంది. ఇలాంటి యోగ్యతను పొందాలంటే రక్షణభాగ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ తాము చేసిన పాపాలకు నిండుమనస్సులతో పశ్చాత్తాపపడాలి. హృదయపరివర్తనం చెందాలి. మారిన మనస్సుకు నిదర్శనంగా నీతికార్యాలు చేస్తూ నిజాయితీగా జీవించాలి. (మత్తయి 7:21-23).

ఒక్కమాటలో చెప్పాలంటే దేవుడు ప్రసాదించే రక్షణభాగ్యాన్ని అందుకునే అవకాశం అందరికీ ఉన్నప్పటికీ, "వివాహవస్త్రం" లేనివారికి... "సత్యమైన నీతిని, పరిశుద్ధతను కలిగి దేవుని పోలికగా సృజింపబడిన క్రొత్త స్వభావమును" ధరించనివారికి మాత్రం లభ్యంకాదు

## ముగింపు:

దేవుడు, మానవులందరు రక్షణ పొందాలని కోరుతున్నారు. తన రాజ్యంలో ప్రవేశించుమని అందరిని ఆహ్వానిస్తూనే ఉన్నారు. కానీ దేవుని పిలుపును అందరూ ఒకే విధంగా ఆలకిస్తారని ఒకే తీరుగా స్పందిస్తారని చెప్పలేం.

దేవుని పిలుపును అందుకున్న వారిలో కొందరు రక్షణ పొందిన క్రైస్తవులపై కక్షపూని మరీ హింసిస్తారు, బాధిస్తారు, నెత్తురు చిందిస్తారు. మరికొందరు దేవును పిలుపును ఆలకించి, ఆయన ఆదేశాలను పాటించడానికి ముందుకొస్తున్నారు. వారు దేవుడిపట్ల తమకుగల భక్తి విశ్వాసాలను తమ తాము సత్క్రియల ద్వారా తాము సిద్ధపరచుకొంటున్నారు, దేవుని పిలుపునకు త్రికరణ శుద్ధిగా బదులు పలుకుతున్నారు.

ఒకవేళ ఈరోజే మనం దేవుని న్యాయపీఠం ఎదుట నిలబడవలసి వస్తే అందుకు మనం సిద్ధంగా ఉన్నామా? దేవుడు మనకు పరలోకరాజ్య ప్రవేశం కల్పిస్తారని నిశ్చయంగా చెప్పగలమా?!.

# వేదవ్యాపక ఆదివారం
# 22-10-2017

## సకల జాతులకు సువార్త

క్రీస్తు సువార్తను బోధించటం, క్రైస్తవ విశ్వాసాన్ని వ్యాపింపచేయటం, శ్రీసభ కర్తవ్యం. అనగా ప్రతి క్రైస్తవుని విద్యుక్త ధర్మం. "ఇహపరములందు నాకు సర్వాధికార మీయబడినది. కనుక మీరు వెళ్ళి సకల జాతిజనులకు పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున జ్ఞానస్నానమొసగుచు, వారిని నా శిష్యులను జేయుడు. నేను మీకు ఆజ్ఞాపించినదంతయు వారాచరింప బోధింపుడు. లోకాంత్యము వరకు సర్వదా మీతోనుందును" (మత్తయి 28:18-20) అని యేసు తన శిష్యులతో పలికాడు. క్రీస్తు ఆజ్ఞానుసారం ఆదినుండి శ్రీసభ సువార్తా బోధను అన్నిజాతులకు గరపుతూ, ప్రపంచపు నలు మమూలల క్రైస్తవ మతాన్ని స్థాపిస్తూ వచ్చింది. శ్రీసభ ఆరంభం నుండి అనేకమంది మత వ్యాపకానికై విదేశాలకు వెళ్ళి, నానాహింసలపాలై వేద బోధచేశారు. క్రైస్తవ మతం ఒక్క జాతికి, దేశానికి పరిమితమైనది గాదు. అది సార్వజనీనమైనది.

### సకలజాతుల స్తుతి

ఈ దినం మొదటి పఠనంలో యెషయా ప్రవక్త ఆఖరి రోజుల్లో అన్ని జాతులవారు యావే ప్రభువును స్తుతింతురని ప్రవచిస్తున్నాడు. "అంత్య దినములలో పర్వతములపైని యావే మందిరము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటే ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దాని లోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము, యెరుసలేములో నుండి యావే వాక్కు బయలు వెడలును. జనులు గుంపులుగుంపులుగా వచ్చి 'యాకోబు దేవుని మందిరమునకు యావే పర్వతమునకు మనము వెళ్ళుదము రండి. ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును, మనము ఆయన త్రోవలో నడుతుము. అని చెప్పుకొందురు..." (యెషయా 2:1-5). ఇస్రాయేలీ ప్రజలు యావే ప్రభువుయొక్క ఎన్నిక ద్వారా ప్రభు ప్రజలయ్యారు. సీనాయి కొండ వద్ద ప్రభువు ఇస్రాయేలితో ఒడంబడిక చేసియున్నారు. వారు యావేని ఆరాధించే పవిత్ర ప్రజా, యాజకరూప రాజ్యమయ్యారు. (నిర్గమ 19:5-6). అప్పటి ఆ ప్రజలు సకల జాతులకు యావే ప్రభువుని ఎరిగించటం తమ

బాధ్యతనుకున్నారు. ఇక పూర్వ వేద ప్రజలకు ఎన్నిక ఎలాంటిదో నూత్న వేద ప్రజలమైన మనకు జ్ఞానస్నానం అలాంటిది. దానిద్వారా మనం కూడా ప్రభువు పవిత్ర ప్రజలము, అతని పూజించే యాజక రూప రాజ్యము అయ్యాము: " మీరు ఎన్నుకొనబడిన జాతి, రాచరికపు గురుకులము, పవిత్రమైన జనము. దేవుని సొంత ప్రజలు. దేవుని అద్భుత కృత్యములు ప్రకటింప ఏర్పరపబడినవారు. ఆయన మిమ్ము చీకటి నుండి అద్భుతమగు తన వెలుగులోకి పిలిచెను. ఒకప్పుడు మీరు దైవ ప్రజలు కారు. కానీ ఇప్పుడు మీరు దేవుని ప్రజలు. ఒకప్పుడు దైవకృపను ఎరుగరు కాని ఇప్పుడు మీరు ఆ కృపను చవిచూచితిరి". (1 పేత్రు 2:9-10). ఇస్రాయేలు ప్రజల్లాగే మనం కూడా క్రీస్తును లోకానికి తెలియజేయాలి. ఆయన అద్భుత కృత్యాలను ప్రకటించాలి. క్రీస్తు ప్రేషితుడు. క్రీస్తులోకి జ్ఞానస్నానం పొందిన మనకు ఆయన లక్షణాలు సంక్రమిస్తాయి. ఆయన వలె ప్రతి క్రైస్తవుడు ప్రేషిత కార్యాన్ని చేపట్టాలి. అపుడే యెషయా ప్రవక్త పలికిన ప్రవచనం నెరవేరేది.

## ప్రేషిత బాధ్యత :

ప్రేషితకార్యం, సువిశేష సేవ, గురువులు, మఠకన్యలు మాత్రమే కాక ప్రతి క్రైస్తవుడు నెరవేర్చవలసిన బాధ్యత. జ్ఞానస్నానం ద్వారా ప్రతి క్రైస్తవుడు ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాడు. ఈ బాధ్యతను క్రైస్తవులందరు ఎరుకపరచి వారిలో మత వ్యాపకానికై ఉత్సాహాన్ని పుట్టించడానికి 11వ భక్తినాథ పాపుగారు 1926 సం॥ ఏప్రిల్ 14వ తేదిన వేదవ్యాపక ఆదివారాన్ని స్థాపించారు. ఈ దినం క్రైస్తవులంతా వేదవ్యాపకానికై ప్రార్థనలు సలిపి, తమ శక్తి కొలది ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. ప్రపంచంలో మూడింట రెండు వంతులకు పైగా క్రైస్తవేతరులు ఉన్నారు. వీరందరకు క్రీస్తు సువార్తను బోధించడాన్కి అందరు సహకరిస్తేనే సాధ్యమయ్యేది. క్రైస్తవ సమాజమంతా కలసి క్రీస్తు జ్ఞాన దేహం. ఈ దేహానికి మనమే అవయవాలం. కనుక మనం పనిచేయందే ఈ దేహం వృద్ధి చెందదు. మనం కృషి చేసి క్రీస్తు దేహమైన క్రైస్తవ సమాజాన్ని పెంపులోకి తీసికొని రావాలి.

## సహాయక సంస్థలు :

క్రైస్తవుల వేదవ్యాపకానికై ప్రార్థనలు సలిపేటట్లు ఆర్థిక సహాయాన్ని అందించేటట్లు ప్రోత్సహించడానికి పలువిధములైన సంస్థలు ఏర్పడ్డాయి. 1822 వ సం॥లో ఫ్రాన్సు దేశంలోని లియోను పట్టణంలో పౌలిన్ జెరికో అనే వనిత కొందరి

సహాయంతో విశ్వవ్యాపక సంస్థను స్థాపించింది. ఈ సంస్థ కాలక్రమేణ పెరిగి పెద్దదై అన్ని దేశాల్లో వ్యాపించింది. వేదవ్యాపకం యెడల క్రైస్తవుల్లో ఆసక్తిని పుట్టించి వారినుండి ప్రార్ధనా సహాయం ఆర్ధిక సహాయం కోరటమే ఈ సంస్థ ఉద్దేశ్యం. అట్లే 1843వ సం॥లో బిషప్ ఫోర్‌బిన్ జాన్‌సన్ అనే పీఠాధిపతి ఈ ఉద్యమాన్ని బాలబాలికలలో ప్రచారం చేయటం కోసం మరో సంస్థను స్థాపించారు. దీనిని పరిశుద్ద పసిబాలల సంస్థ అంటారు. పాశ్చత్య దేశాల్లో ఉన్న బాలబాలికలు వేదవ్యాపక దేశాల్లో ఉన్న తమ తోటి పిల్లలకు సహాయాన్ని అందించటానికి ఈ సంస్థ ఉద్దేశ్యింప బడ్డది. ఆ తరువాత కొంతకాలానికి స్తెఫని బిగార్డ్ అనే వనిత పునీత పేతురు సంఘాన్ని స్థాపించింది. వేదవ్యాపక దేశాల్లో స్థానిక గురువుల శిక్షణకై వలసిన సహాయాన్ని అందించడమే ఈ సంఘం యొక్క ముఖ్య ఉద్ధేశ్యం. 1916వ సం॥ లో పౌలోమన్నా అనే గురువు మరో సంస్థను స్థాపించారు. గురువుల్లో వేదవ్యాపకంపై ఆశక్తిని జనింపజేయడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ప్రేషిత కార్యంలో గురువులు ఆదర్శాన్నివ్వాలి. సువిశేష బోధ జయప్రదం కావాలంటే అదిముఖ్యంగా గురువులపై ఆధారపడి యున్నది. ఈ విధంగా ఈ సంస్థలన్నీ మత వ్యాపకానికై పాటుపడుతున్నాయి. క్రైస్తవులంతా ఈ సంస్థలకు తమ సహకారాన్ని అందించాలి.

## ఆదర్శ జీవితం:

క్రైస్తవులు మంచి క్రైస్తవ జీవితం జీవిస్తూ, క్రీస్తుకు సాక్షులుగా ఉంటూ వేదవ్యాపకానికై తోడ్పడాలి. మన సత్ప్రవర్తన, ఆదర్శ జీవితం,క్రైస్తవేతరులను క్రీస్తు వైపుకు ఆకర్షించాలి. మన విధులను, దినకృత్యములను సక్రమంగా నెరవేర్చటం నీతి, న్యాయం, ధర్మం పాటిస్తూ పరిశుద్ధ జీవితం జీవించటం, తోటి వారి యెడల సోదర ప్రేమతో మెలగడం, కుటుంబంలో, సంఘంలో శాంతి పరులుగ జీవించడం ఆదర్శ క్రైస్తవ జీవితం అని చెప్పవచ్చు. మనం దీప స్తభం మీద పెట్టిన దీపం లాంటి వాళ్ళం, పర్వతం మీద నిర్మించిన నగరం లాంటి వాళ్ళంగా జీవించాలి. మన వెలుగు, ఉనికి ఇతరులు గుర్తించి ఆకర్షింపబడాలి. పౌలు తన ప్రేషిత జీవితాన్ని ఓ దీపంతో పోల్చాడు. దీపం తన చమురును తను వ్యయం చేసుకుంటూ మనకోసం వెలుగుతుంది. తాను కాలిపోతూ మనకు వెలుతురునిస్తుంది. అట్లే ప్రతి క్రైస్తవుడు తన స్వార్ధాన్ని వదిలి సువిశేష బోధకై పాటుపడాలి.

# సామాన్య 30వ ఆదివారం
# 29-10-2017

***నిర్గమ 22:20-26      1తెస్స 1:5-10      మత్తయి 22:34-40***

దేవుడు తనను ప్రేమించుమని ఆదేశించారు. అలాగే సాటి మానవుల్నీ ప్రేమించుమని ఆజ్ఞాపించారు. దేవుడు ఇలా మనల్ని ఆదేశించడం వలన మనకు రెండు విషయాలు బోధపడుతున్నాయి. **ఒకటి:** మానవ మాత్రులమైన మనం మనకున్న సహజ బలహీనతల కారణంగా ఇతరులను ప్రేమించడం సాధ్యం కాదు; కనుకనే దేవుడు ప్రత్యేకంగా ఆదేశించ వలసి వచ్చింది. **రెండవది:** చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే పరులను ప్రేమించడం అసాధ్యం కాదు. కనుకనే దేవుడు మనకీ ఆజ్ఞనిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు తగిన శక్తి సామర్థ్యాలు మనకు దివ్యసత్ప్రసాదం ద్వారా లభిస్తాయి. దివ్యసత్ప్రసాదం మనకు సాక్షాత్తూ యేసు ప్రభువులోని పావిత్ర్యాన్నీ, ప్రేమశక్తినీ ప్రసాదిస్తుంది; తద్వారా మనం దేవుని ప్రేమించగలుగుతాం.

అలాగే దేవునిపట్ల మనకున్న వ్యక్తం చేయడానికిగాను మన తోటి మానవులను సైతం ప్రేమించగలుగుతాం. దివ్యసత్ప్రసాదం ద్వారా యేసు ప్రభువు మనకు తన ప్రేమశక్తిని అనుగ్రహిస్తూనే ఉంటారు. అటు దేవుణ్ణీ, ఇటు మన సాటి వారినీ ప్రేమించడానికి తోడ్పడుతూనే ఉంటారు.

**మొదటి పఠనం: నిర్గమ 22:20-26**

ఇస్రాయేలీ ప్రజలు మోషే నాయకత్వంలో ఈజిప్టు దాస్యంనుంచి విముక్తులై వచ్చాక కొంతకాలం సీనాయి పర్వత ప్రాతంలో విడిది చేశారు. నిజానికి అక్కడేవారు యదార్థమైన దేవుని గురించి తెలుసుకున్నారు. "దేవుని ప్రజలు" గా జీవించడము అంటే ఏమిటో నేర్చుకోగలిగారు.

అవును. ఈజిప్టులో ఉండగా తమను పిలిచిన దేవుడెవరో, తమ నుంచి ఆయన ఏం కోరుతున్నారో ఇస్రాయేలీయులు తెలుసుకోలేకపోయారు. ఈజిప్టులో ఉండగా వారు కేవలం బానిసలు మాత్రమే; ప్రత్యేకమైన "గుర్తింపు" అంటూ వారికి ఏది ఉండేది కాదు. కానీ ఇప్పుడు వారు స్వతంత్రులు. "దేవుని ప్రజలు" అనే గుర్తింపు వారికి లభించింది. గౌరవ ప్రదమైన ఈ హోదాకు తగినట్లు జీవించే ప్రయత్నం చేస్తున్నారు. దేవుడే స్వయంగా వారిని తన ప్రజలనుగా తీర్చిదిద్దుతున్నారు.

ఈనాటి మొదటి పఠనంలో మనం దేవుడు ఇస్రాయేలీయుకు చేస్తోన్న ధర్మోపదేశాలను చదువుతున్నాం. ఇవి సమాజంలో వారు పాటించవలసిన సౌహార్ద నియమాలకు సంబంధించినవి. ఈ ఉపదేశాలనుంచి ఇస్రాయేలీయులు నేర్చుకోవలసిన పాఠాలు రెండు ఉన్నాయి.

**ఒకటి:** గతంలో తాము ప్రవాసులుగా, పరదేశులుగా బ్రతికారనీ, తాము పొందిన స్వేచ్ఛ, తాము పొందబోయే వాగ్దత్తభూమి, తాము స్వయంకృషితోనో రాజకీయ ప్రాపకంతోగానీ సాధించుకున్నవి కావనీ, అవి దేవుడు వారికి ఉచితంగా ఇచ్చిన వరాలు మాత్రమేననీ ఇస్రాయేలీయులు గుర్తుంచుకోవాలి. కనుక వారు మిడిసిపాటుకు లోనుకాకూడదనీ, సాటి వారికంటే, సాటితెగల కంటే తాము అధికుల మన్న గర్వానికి గురికారాదనీ తెలుసుకోవాలి. దేవునికి సదా విధేయులై ఉండాలి. సాటివారిపట్ల సౌహార్దంతో మెలగాలి.

**రెండవది:** ఒకప్పుడు ఇస్రాయేలీయులందరు పరదేశులుగా బతికిన వాళ్ళే గనుక, వారు పరదేశంలో నిరుపేదలుగా జీవిస్తున్నపుడు దేవుడెలా వారిని దయతో చూచి ఆదరించారో, అలాగే ఇప్పుడు వారు తమ సాటి పేదవారిని దయతో చూడాలి. ఆదుకోవాలి. ఇందుకు కొన్ని ఉదాహరణలు మనకీ పఠనంలో కనిపిస్తాయి. అందులోని ఒక ఉదాహరణ: ఒక పేదవాడు కుదువపెట్టడానికి తన వద్ద ఏమీలేక, తన నిలువుటంగీనే కుదువ పెట్టినట్లయితే, దానిని కుదువ పెట్టుకున్నవాడు "పొద్దుగూకుటకు ముందే" దానిని తిరిగి స్వంతదారుకు ఇచ్చివేయాలని దేవుడు ఆదేశిస్తున్నాడు. ఇలా పొద్దున కుదువ పెట్టుకున్న సొమ్మును సాయంత్రానికి తిరిగి స్వంతదారుకు ఇచ్చివేయాలని దేవుడు ఆదేశిస్తున్నాడు. ఇలా పొద్దున కుదువ పెట్టుకున్న సొమ్మును సాయంత్రానికి తిరిగి ఇవ్వడంలో అర్థమూ ఉండదు, ఉద్దేశించిన ప్రయోజనమూ నెరవేరదు. కనుక పేద ప్రజల నుంచి ఎలాంటి సొమ్మునూ కుదువ పెట్టుకోకుండానే వారికి అవసరమైన సొమ్మును అప్పుగా అందజేయాలన్నది తాత్పర్యం.

సువార్త పఠనంలో ధర్మచట్ట సారాంశాన్ని బోధిస్తూ యేసుప్రభువు చేసిన సత్యోపదేశానికి ఈ పఠనం మంచి పరిచయమవుతుంది.

## రెండవ పఠనం: 1 తెస్స 1:5-10

ఈనాటి రెండవ పఠనంలో మనం గమనించవలసిన రెండు ముఖ్యాంశాలున్నాయి:

**మొదటిది:** త్రియేక దేవుని ప్రస్తుతి. పునీత పౌలు ఈ భాగంలో త్రియేక దేవుని

స్మరిస్తూ, ఆయనను భక్తి ప్రపత్తులతో స్తుతిస్తున్నారు. తండ్రి దేవుడు యేసు ప్రభువుకు పునర్జీవం ప్రసాదించారు, పునరుత్థానుణ్ణి కావించారు; పునరుత్థానుడైన యేసుప్రభువు క్రైస్తవులను నిత్యనరకాగ్ని నుంచి కాపాడుతున్నారు; పవిత్రాత్మ ప్రభువు క్రైస్తవులకు అపురూపమైన ఆత్మానందాన్ని ప్రసాదిస్తున్నారు; వేదహింసల ననుభవించే సమయంలో సైతం వారికి శాంతి సహన వరాలను ఆత్మానందాన్నీ అనుగ్రహిస్తున్నారు. ఈ త్రియేక దేవుని పుణ్యనామాన్ని స్మరించడం ద్వారా పునీత పౌలు మానవచరిత్రకు జీవనాడి వంటి యేసు మరణ పునరుత్థాన ఘట్టాన్ని మనకు గుర్తు చేస్తున్నారు.

అలాగే తెస్సలోనికలోని అన్యజాతీయులు త్రియేక దేవుని పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించడం ద్వారా, యేసుప్రభువే తమ రక్షకుడన్న సత్యాన్ని మనఃపూర్వకంగా ఆమోదించడం ద్వారా మాసిదోనియా అకయాలలోని అన్యజనులకు మార్గదర్శకులయ్యారని ప్రశంసిస్తున్నాడు.

**రెండవది:** క్రైస్తవులు దైవోపదేశాలను, పవిత్రాత్మను సాక్షాత్తు యేసుప్రభువు ద్వారానే స్వీకరిస్తారు. విశ్వాసుల దైనందిన జీవితాలలో ప్రతిబింబించే సువార్తా విలువలు, పవిత్రాత్మ ప్రసాదించే ఆత్మానందమే వారు క్రీస్తు ప్రభువుకు చెందిన వారని నిరూపిస్తూ ఉంటాయి.

## సువార్త పఠనం: మత్తయి 22:34-40

యూదమత నాయకులు యేసుప్రభువుపై మరోమారు దోషారోపణ చేయడానికి, ఆయనను ధర్మ సంకటంలోనికి నెట్టడానికి ఏవిధంగా విఫలయత్నం చేశారో ఈనాటి సువార్త పఠనంలో చదువుతున్నాం. ఈసారి యూదమత చట్టాలన్నీ తెలిసిన ధర్మశాస్త్ర బోధకుడొకరు యేసును "పరీక్షించ" డానికి పూనుకున్నాడు. "ధర్మశాస్త్రమందు అత్యంత ప్రధానమైన ఆజ్ఞ ఏది?" అంటూ పైకి ఒకే ఒక ప్రశ్న అడిగినప్పటికీ, నిజానికి యేసుప్రభు కాలంలో అమలులో ఉన్న ధర్మచట్టాలన్నింటినీ, పది ఆజ్ఞలను, 613 ఇతర ప్రవర్తనా నియమాలను క్రోడీకరించి, వాటి సారాంశాన్ని ముక్తసరిగా మూడుమాటల్లో చెప్పుమని అడుగుతున్నాడు. ఇది ఒక విధంగా యేసుప్రభు ధార్మిక పరిజ్ఞానానికే పరీక్షవంటిది.

సాధారణంగా యూదమత గురువులు ఇలాగే చేస్తూండేవారు. తమకు గల చట్ట పరిజ్ఞానాన్నీ, అవగాహన స్థాయినీ, బోధనా సామర్థ్యాన్నీ నిరూపించుకోడానికి ధర్మచట్టాలన్నింటినీ ఒకటి రెండు వచనాలకు కుదించి చెబుతూ ఉండేవారు. ప్రసిద్ధుడైన

యూదమత గురువు హిల్లెల్ ధర్మశాస్త్ర సారాంశాన్నంతా ఒకే ఒక్క వచనంలో చెబుతూ ఇలా అన్నాడు. "నువ్వెప్పుడూ ఎలాంటి పనులను ద్వేషిస్తూ ఉంటావో, ఇతరులు నీపట్ల ఎలా ప్రవర్తించకూడదని కోరుకుంటూ వుంటావో, ఆలాంటి పనులను నువ్వెప్పుడూ చేయకు, ఇతరులపట్ల ఆవిధంగా ప్రవర్తించకు."

అయితే ఇలా మతగురువులు చెప్పే చట్ట సారాంశ వచనాల్లో ఎక్కువగా నిషేధాలే ఉండేవి. "దేవుని ప్రేమించు", పొరుగువానిని ప్రేమించు" అనే రెండు ఆజ్ఞల్లో ఏదో ఒక్కదానిని గురించే, వారు నొక్కి చెబుతూ, రెండవ ఆజ్ఞను పూర్తిగా విస్మరించేవారు. ఇది పొరపాటు. కానీ ఇదే పొరపాటును యేసుప్రభువు చేత కూడా చేయించాలన్నది ధర్మశాస్త్ర బోధకుడి పన్నాగం. ప్రభువు కూడా "దైవప్రేమ", "సోదరప్రేమ" ఆజ్ఞల్లో ఒక్కదానినే ప్రస్తావించి రెండవదానిని విస్మరిస్తారనుకున్నాడు. కానీ ప్రభువలాంటి పొరపాటు చేయలేదు.

యేసుప్రభువు తానిచ్చిన జవాబులో పైన పేర్కొన్న రెండు ఆజ్ఞలకు సమానమైన ప్రాధాన్యమిచ్చారు. ద్వితీయోపదేశ కాండం 6:15 నుంచి "దైవప్రేమాజ్ఞ" ను, లేవీకాండం 19:18 నుంచి "సోదరప్రేమాజ్ఞ" ను స్వీకరించి ఇవే అన్నిటికంటే ప్రధానమైన ఆజ్ఞలని స్పష్టం చేశారు.

అయితే యేసుప్రభువు ఇలా ఈ రెండు ఆజ్ఞలను పక్కపక్కన చేర్చి చెప్పడంలో కొత్తదేమీలేదు. గతంలో అనేక యూదమత గ్రంథాలే ఈ పనిచేశాయి.

యేసు ప్రబోధంలోని కొత్తదనం ప్రధానంగా రెండు అంశాల్లో వ్యక్తమవుతుంది.

**ఒకటి:** యేసు ఈ రెండు ఆజ్ఞలలో కూడా ప్రధాన్యతాక్రమాన్ని పాటించారు. "దేవుని ప్రేమించు" మనే ఆజ్ఞకు ప్రథమస్థానమిచ్చారు; ఇక్కడ దేవుని ప్రేమించడమూ అంటే ఆయనపట్ల కేవలం ప్రేమభావన కలిగి తలపులలోను, మాటలలోను, చేతల ద్వారాను వ్యక్తం చేయాలి; దేవుని ఆదేశాలకు కట్టుబడి జీవించాలి.

"నీ దేవుడైన ప్రభువును నీవు పూర్ణ హృదయముతోను,
పూర్ణాత్మతోను, పూర్ణ మనస్సుతోను ప్రేమింపవలెను"

ఈ ఆజ్ఞకు ప్రత్యామ్నాయం లేదు.

**రెండవది:** దేవుని ప్రేమించుమనే ఆజ్ఞతో "పొరుగువానిని ప్రేమించు" మనే ఆజ్ఞను జోడించి చెప్పేటపుడు, రెండవ ఆజ్ఞ చివర్న "ఇట్టిదే" అనే మాటను వాడారు. "..నిన్ను నీవు ప్రేమించుకొనునట్లు నీ పొరుగువానిని ప్రేమింపవలయును" అను రెండవ ఆజ్ఞయు ఇట్టిదే. దీనినిబట్టి మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే "పొరుగు వారిపట్ల"

మనం చూపే ప్రేమ, దేవుని పట్ల మనకున్న ప్రేమకు ఒకానొక వ్యక్తీకరణం అవుతుంది. అంటే పొరుగువారిని మనం ప్రేమించలేకపోతే దేవుని పట్ల మనకుండే ప్రేమ కేవలం మనోభావనగానో, భావోద్వేగంగానో మాత్రమే మిగిలిపోతుంది. అదేవిధంగా దేవుని పట్ల యథార్థమైన ప్రేమ లేకుండానే, సాటివారిని ప్రేమించాలని చూస్తే అది స్వార్థపూరితమైన వైయక్తిక ప్రేమ మరో రూపమవుతుందే తప్ప, అందులో నిజాయితీ ఉండదు, నిజమైన ప్రేమ అనిపించుకోదు.

ఇకపోతే యేసుప్రభువు ఇలా దైవప్రేమనూ సోదరప్రేమను అనుసంధానించినది పరిసయ్యుల మీద ఆధిక్యాన్ని ప్రకటించడానికి కాదు, వారిని పరాజితుల్ని చేయడానికి కాదు. ఇది తన జీవితంలో కార్యరూపం దాల్చబోతోన్న సత్యం కనుకనే ఆయనిలా దైవప్రేమను, సోదరప్రేమను అతి సహజంగా అనుసంధానించి చెప్పగలిగారు. అవును. తండ్రి దేవునిపట్ల తనకు గల ప్రగాఢమైన ప్రేమ కారణంగానే ఆయన మానవుల రక్షణార్థం మరణించబోతున్నారు. తండ్రి దేవుని పట్లగల ప్రేమే ఆయనను సిలువ మరణానికి నడిపించబోతోంది, దైవప్రేమ ఆయనను ఆత్మబలిదానానికి సిద్ధపరచింది!

ఈ సత్యాన్ని "పెంతెకోస్తు" సంఘటన అనంతరం పేతురు, యాకోబు, యోహాను ఇలా అపోస్తలులందరు గ్రహించ గలిగారు; మనలో ఉండే దేవుని ప్రేమ సహజంగానే సోదరప్రేమ రూపంలో వ్యక్తమవుతుంది అని తెలుసుకోగలిగారు.

**ముగింపు:**

మన ప్రక్కనున్న మనిషిని ప్రేమించకుండా అదృశ్యుడై ఉన్న దేవుణ్ణి ప్రేమించడం సాధ్యంకాదు. మొదటి పఠనంలో మోషే ఇస్రాయేలీ ప్రజలకు ఇదే ధర్మోపదేశం చేశాడు. యేసుప్రభువు తన సువార్తా ప్రబోధంలోనూ ఇదే సందేశాన్ని పునరుద్ఘాటించారు. ఇదే ఉపదేశాన్ని పునీత మదర్ థెరిస్సా ఒకసారి తనదైన శైలిలో ఈవిధంగా వ్యక్తం చేశారు.

"మన పొరుగువారిలో ప్రతిఒక్కరు మారు వేషంలో ఉన్న దేవుడే".

# బైబిలు ప్రశ్నలు - సమాధానాలు

- రెవ.ఫా.డా॥ సగినాల ప్రకాశ్ గారు (కడప పీఠం) రచించిన "వాక్యవికాసల" నుండి

**1. 'బైబిలు' అనగానేమి?**

ఆంగ్లపదమైన 'బైబిల్' "ది బిబ్లియా" అనే గ్రీకు పదంనుండి వచ్చింది. దానికి, పుస్తకాలు అని అర్థం. అంటే ఒక పుస్తకంలో దాగి ఉన్న మరిన్ని పుస్తకాలుగా చెప్పుకోవచ్చు. నిజానికి Biblia అనే పదం బైబిల్‌లో కనిపించదు. క్రీ.శ 4వ శతాబ్ధంలో కథోలిక శ్రీసభ, దైవప్రేరణతో రచించిన పుస్తకాలన్నీ ఒకచోటికి తీసుకువచ్చింది. ఈ గ్రంథాలన్నిటిని కలిపి ఒకే గ్రంథంగా పేర్కొంది. Biblos అన్నది ఫినిషియా దేశంలోని ఒక పట్టణం పేరు. ఆ పట్టణంలో తాటిచెట్టులు విరివిగా మొలిచేవి. ఆ తాటిమట్టలను, వ్రాసు పత్రాలుగా ఉపయోగించేవారు. వాటినే తాళ పత్రాలు అంటున్నాం. ఆ నేపథ్యంనుండి వచ్చినBiblia రూపాంతరం చెంది, బైబిల్ గా పిలువబడింది. దానినే ఆంగ్లంలో Bible అన్నారు. తెలుగులోనూ అదే పేరుతో పిలుస్తున్నాం.

**పవిత్రగ్రంథమైన బైబిలు గురించి ఈ అంశాలు గుర్తుంచుకోవాలి.**

1. దేవునికి మనుషులకు మధ్య జరిగిన సత్సంబంధ చరిత్ర, బైబిలు.
2. బైబిలులో మనుషులపట్ల దేవునికున్న ప్రేమ, అక్షరబద్ధం చేయబడింది.
3. మనుషులకు, దైవావిష్కరణ జరిగిన తీరును నిజాయితిగా వివరించిన గ్రంథం బైబిలు.
4. క్రైస్తవ పరిశుద్ధ గ్రంథాల సేకరణే బైబిలు గ్రంథం.
5. పవిత్రాత్మచే ప్రేరేపితులైన మనుషులు, దేవుని వాక్యాన్ని తమ హస్తాలతో లిఖితం చేసి, ముందుతరాలకు అందించిన పవిత్రగ్రంథం బైబిలు.

**2. బైబిలు ఏ ఏ భాషలలో వ్రాయబడింది?**

దైవ ప్రేరణతో రచనకు పూనుకున్న రచయితలు, మూడు భాషలలో ఈ గ్రంధాలను రచించారు. అవి, హీబ్రూ, అరమాయిక్ మరియు గ్రీకు భాషలు.

**హీబ్రూ భాష :** ఇదిత సెమిటిక్ తెగలకు చెందిన ఒక భాష. నోవా పుత్రుడైన 'హేమ్' ఈ భాషను మొదట మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇది అరబిక్ భాషకు దగ్గర బంధువు. కుడి నుండి ఎడమకు వ్రాసే విధానం ఈ భాషలకు ప్రత్యేకం. ఈ భాషను ఇశ్రాయేలు ప్రజలు బాబిలోను వలస తరువాత కూడా కొన్ని శతాబ్దాల వరకు మాట్లాడేవారు. ఆ తరువాత ఇది కేవలం ప్రార్థనలకు, వ్రాతలకు మాత్రమే పరిమితమయింది. పూర్వనిబంధనలోని సింఘభాగం హీబ్రూ భాషలో లిఖించబడింది.

**అరమాయిక్ భాష :** ఈ భాష కూడా సెమిటిక్ తెగలకు చెందినదే. ఇప్పుడు సిరియాగా పిలువబడే 'అరామ్' (ARAM) ప్రాంతంనుండి ప్రాచుర్యంలోకి వచ్చినది. ఇది ప్రముఖంగా దమాస్కసు, బాబిలోను మొదలుకొని, ఈజిప్టు పరిసర ప్రాంతాల వరకూ ప్రజా నాలుకలమీద నడయాడిన భాష. యేసుక్రీస్తు కాలంలో పాలస్తీనా యూదుల అధికారభాషగా ప్రాచుర్యం పొందింది. ఈ భాష చేసికొన్న అదృష్టమేమిటంటే, సాక్షాత్తూ యేసుక్రీస్తు ఈ భాషలో మాట్లాడటం. పూర్వనిబంధనలోని కొన్ని భాగాలు ఈ భాషలో వ్రాయబడినవి. మత్తయి సువిశేషం మొదట పూర్తిగా ఈ భాషలోనే వ్రాయబడిందని పండితుల అభిప్రాయం. అయితే ఈ ప్రతి ఇప్పుడు లభించదు. బాబిలోను వలస తరువాత అరమాయిక్ భాష. పాలస్తీనా వాసులందరి భాషగా స్థిరపడిపోయింది.

**గ్రీకు భాష :** నాగరికతను సంతరించుకొన్న సిరియా, ఈజిప్టులలోని గొప్ప పట్టణాల అధికార భాష. సొలోమోను జ్ఞానగ్రంథము, మక్కబియేలు రెండవ గ్రంథము, గ్రీకు భాషలో రచించబడినాయి. అయితే నూతన నిబంధనలోని గ్రంథాలన్నీ గ్రీకు భాషలో వ్రాయబడటం విశేషం.

## 1. నెలలో రెండవ ఆదివారపు చందా:

ది. 11-09-2017న జరిగిన "గురువుల ప్రతినిధుల" (Priests' Senate) సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం, ఈ సంవత్సరం నవంబరు నెలనుండి ప్రతి రెండవ ఆదివారపు చందాను ప్రతి విచారణ గురువు మేత్రాసనానికి పంపవలెను.

## 2. ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీల కొరకు:

ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీల కొరకు మరియు క్రైస్తవులకు "దళిత" (SC) హోదా (Status) కల్పించాలని జరుగుతున్న ఉద్యమంలో విచారణ కేంద్రాలనుండి ఇచ్చే వివాహపు సర్టిఫికేట్ సరిపడనందున జిల్లా రిజిస్ట్రార్ అధికారి వాటిని అనుమతించనందున, క్రైస్తవ యువతీయువకులు వారి వివాహ ప్రకటన రాయించుకున్న రోజున గాని, లేదా వివాహము జరిగిన వెంటనే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదుచేయించుకోవలెను. గురువులు, ఉపదేశులు ఈ విషయాన్ని విశ్వాసులకు అర్థం అయ్యే రీతిలో తెలియపరచగలరు.

## 3. వివాహ ఫీజు:

1. ఇప్పటి వరకు ఒక్కొక్క వికారియేట్‌లో ఒక్కో విధమైన వివాహపు ఫీజు ఉండేది. ఇప్పుడు వాటినన్నింటిని రద్దు చేస్తూ, మేత్రాసనం అంతటా ఒకే విధమైన ఫీజు రూ.3,500/- ఉండాలని "గురువుల ప్రతినిధుల" సభలో నిర్ణయించడం జరిగింది. దానిలో ఉపదేశికి రూ. 1000/- చెల్లుతుంది.
2. వివాహం రోజున జరిగే పూజలో వచ్చే చందాలో ఉపదేశికి ఎటువంటి భాగం ఉండదు.
3. వివాహ ప్రకటన ఇచ్చే సమయంలో మరియు ప్రకటనలు చదివే సమయంలో ఉపదేశులు పెళ్ళి వారి నుండి ఏ విధమైన ఫీజును వసూలు చేయరాదు. (ప్రకటన ఫీజు)
4. పెళ్ళిసయంలో ఉపదేశులు పెళ్ళివారినుండి ఏ విధమైన వాటిని (కొబ్బరి చిప్పలు, విడి బియ్యం, ఖర్జూరాలు, రైక పీటీలు) ఆశించరాదు.
5. గ్రామాలలో ఆదివారం జరిగే ప్రార్థనలో వచ్చిన చందాలో 1/4 భాగం చందా ఉపదేశికి చెందవలెను.

6. క్రిస్మస్, నూతన సంవత్సరం,ఈస్టర్ పండుగ సమయంలోవచ్చే చందాలో 1/2 చందా ఉపదేశికి చెందవలెను.

## 4. ఉపదేశులకు సహాయం:

1. రిటైర్‌మెంట్ పారితోషికం ఇవ్వబడును.
2. వైద్య సహాయం ఇవ్వబడును.
3. గృహ నిర్మాణాలకు సహాయం ఇవ్వబడదు.
4. ఏ ఉపదేశికైనా సంవత్సరానికి ఒక్కసారే సహాయం ఇవ్వబతుంది.
5. ఈ సహాయాలు చెక్కు రూపంలో ఇవ్వబడతాయి.
6. విచారణ గురువులు వారి ఉపదేశులకు సహాయం నిమిత్తం ఉత్తరం రాసేటప్పుడు వారి బ్యాంకు పాస్ పుస్తకంలో ఉన్న పేరును వ్రాయగలరు.
7. ఉపదేశులు సహాయం కొరకు బిషప్స్‌హౌస్‌కు వచ్చేటప్పుడు మీ బ్యాంకు పాస్ పుస్తకాలను తప్పనిసరిగా తీసుకుని రావలెను.

## 5. క్యాంపు అమ్మగార్లు:

మన మేత్రాసనంలో క్యాంపు అమ్మగార్లు కొన్ని సంవత్సరాల నుండి అందించే సేవలు ప్రశంసనీయం. మన విచారణల్లో ఉన్న అవసరాన్ని బట్టి, పీఠాధిపతుల మరియు పాస్టరల్ సెంటర్ ఆహ్వానం మేరకు నిర్మల మరియు ఎఫ్.సి.సి సభల మఠకన్యలు సువార్తీకరణలో సహాయపడుటకు ముందుకు వచ్చారు. వారు ప్రస్తుతం **ఉప్పలూరు, వెన్ననపూడి, నాగాయలంక, మైలవరం, వెలగలగూడెం** విచారణల్లో డిశంబరు నెలవరకు పనిచేస్తున్నారు. 2018 జనవరి నుండి 2018 ఏప్రిల్ వరకు వారి సహాయం కావలసిన విచారణ గురువులు పాస్టరల్ సెంటర్‌కు ఉత్తరం ద్వారా కాని, ఫోన్ ద్వారా కాని తెలియపరచగలరు.

## 6. తెలుగు కతోలిక సమాఖ్య (టి.సి.సి):

అనేది భారత కతోలిక సమాఖ్య (సి.సి.ఐ)లో ఒక ప్రాంతీయ విభాగం. ఈ ప్రాంతీయ విభాగం (టి.సి.సి) తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య (టి.సి.బి.సి)కు ప్రాంతీయ స్థాయిలో, కతోలిక విశ్వాస వికాసానికి. సువార్తీకరణకు, ప్రాంతీయ తెలుగు

పీఠాధిపతులు తీసుకునే నిర్ణయాలలో సలహాదారులుగా ఉంటారు.



ది. 18 సెప్టెంబరు 2017న తెలుగు కతోలిక 6వ సర్వసభ్య సమావేశాలు రామాంతపూర్, హైదరాబాదు, పునీత యోహాను ప్రాంతీయ గురు విధ్యాలయం నందు జరిగాయి. ఈ సమావేశాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి పీఠాధిపతులు పాస్టరల్ సెంటర్ డైరెక్టర్లు మఠవాసుల అధికార్లు, సామాన్య క్రైస్తవ ప్రతినిథులు పాల్గొన్నారు. ఉదయం 9గం॥లనుండి సా॥ 4 గం॥ వరకు జరిగిన ఈ సమావేశంలో మధ్యాహ్నం 1 గం॥ వరకు "క్రైస్తవ కుటుంబాల జీవన విధానాలు, విశ్వాస వికాసానికి తీసుకోవలసిన నిర్ణయాలు", "దైవార్చనలో అనుసరించవలసిన విధానాలు", "శ్రీసభ అభివృద్ధికి సామాన్య క్రైస్తవుల భాగస్వామ్యం అనే అంశాల మీద చర్చలు జరిగాయి. అనంతరం తెలుగు కతోలిక సమాఖ్య (టి.సి.సి) అధ్యక్షులు మహా ఘన తుమ్మా బాల (హైదరబాదు మేత్రాణులు) గారు మరియు ఇతర పీఠాధిపతుల సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. మన మేత్రాసనం నుండి గరికముక్కు అశోక్ వర్ధన్ (బంటుమిల్లి విచారణ) ఉపాధ్యక్షులుగాను. బి. సరోజిని (మాచవరం, గుణదల విచారణ) గారు కార్యవర్గ సభ్యురాలు (ఎక్సిక్యూటివ్ మెంబర్) గాను ఎన్నిక అయ్యారు. వారికి మేత్రాసనం తరుపున పాస్టరల్ సెంటర్ తరుపున అభినందనలు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు (దాదాపు 8సం॥) ఈ సమాఖ్యకు ఉపాధ్యక్షులుగా పనిచేసిన శ్రీ మద్దాల అంతోని గారికి కృతజ్ఞతలు.

# ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు



| | | | |
|---|---|---|---|
| బి. జాషువా | కోటపాడు | 01-10-1983 | 8464947415 |
| పి. యేసుబాబు | ముచ్చింతాల | 01-10-1965 | 9948231236 |
| డి. రాజకుమార్ | బోడవాడ | 01-10-1994 | 9989559259 |
| యస్. దానియేలు | --------- | 04-10-1986 | 9849566023 |
| వై. రాజు | గుడ్లవల్లేరు | 04-10-1976 | ---------- |
| పి. సురేష్ | హెచ్. జంక్షన్ | 05-10-1975 | ---------- |
| జె. జోజిబాబు | మైలవరం | 05-10-1981 | 9866890910 |
| డి. జోసఫ్ తంబి | బంటుమిల్లి | 06-10-1983 | 9849057596 |
| యల్. బాలశౌరి | లక్ష్మీపురం | 06-10-1960 | ---------- |
| యమ్. మోయిాజు | కొన్కేపూడి | 07-10-1950 | 9676528459 |
| వి. రవికుమార్ | వెంట్రప్రగడ | 09-10-1980 | 9542512881 |
| కె. తోమాస్ | -------- | 09-10-1977 | 9502205445 |
| జి. యేసు | కోటపాడు | 09-10-1969 | 8142051921 |
| బి. అబ్రహాము | తిరువూరు | 10-10-1980 | 9652322212 |
| ఇ. రాజు | కోటపాడు | 10-10-1960 | 7032169400 |
| యమ్. బాలస్వామి | ఆగిరిపల్లి | 10-10-1948 | 9951688752 |
| కె. ఇస్రాయేలు | కొత్తపల్లి | 10-10-1972 | 9963398421 |
| పి. రాజు | కోరుకొల్లు | 10-10-1976 | 8008686947 |
| జె. జయరాజు | సిలువగిరి | 10-10-1972 | 9391277560 |
| జె. సత్యం | కీసర | 10-10-1971 | 9985264428 |
| యమ్. పుష్పరాజు | వెంట్రప్రగడ | 10-10-1982 | ---------- |
| జి. నవమనిరాజు | మంగినపూడి | 10-10-1970 | 9849743570 |
| బి. జాన్‌రాజు | కోరుకొల్లు | 11-10-1986 | 9550622470 |
| టి. కొర్నేలు | కోరుకొల్లు | 12-10-1969 | 9553374168 |

| | | | |
|---|---|---|---|
| జి. అంతోని | రమణక్కపేట | 14-09-1974 | |
| వి. జీవరత్నరాజు | పామర్రు | 15-10-1954 | 9948979788 |
| ఠ. అబ్రహాము | పామర్రు | 15-10-1940 | 7036685692 |
| బి. మరియన్న | వెంట్రప్రగడ | 16-10-1964 | ---------- |
| యస్. దావీదురాజు | ఆరుగొలను | 16-10-1966 | 9908402790 |
| యమ్. రమేష్ | భాస్కరరావుపేట | 17-10-1986 | 8465901770 |
| పి. దానియేలు | పోలుకొండ | 17-10-1957 | 9603905181 |
| యమ్. యోహాను | గంపలగూడెం | 18-10-1970 | 9133009189 |
| యమ్. రవి | గంపలగూడెం | 19-10-1981 | 9133831439 |
| పి. ప్రసాద్ | గుడ్మన్‌పేట | 19-10-1985 | 9292202182 |
| యస్. జాన్ | కలిదిండి | 21-10-1971 | ----------- |
| పి. రత్నం | గన్నవరం | 22-10-1966 | ---------- |
| యమ్. ప్రమీలా కుమారి | చల్లపల్లి | 22-10-1979 | 9178423920 |
| పి. కిషోర్ | భైరవపట్నం | 22-10-1968 | 9177558043 |
| యమ్. వెంకటరత్నం | నెహ్రూపేట | 23-10-1991 | 9133833409 |
| పి. మరియకుమార్ | కంచికచర్ల | 24-10-1980 | 9493730051 |
| కె. నరేష్ | చిల్లకల్లు | 30-10-1989 | ---------- |
| ఎ. విజయ సంతోష్ కుమార్ | రమణక్కపేట | 30-10-1990 | 9440184752 |